
ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి

ఏలూరు
జిల్లా వార్తలు
5
సోమవారం 18 మార్చి 2024

ఏలూరు ఉష్ణోగ్రతలు
గరిష్ఠం : 36.0
కనిష్ఠం : 23.0

రంజాన్ వేళలు
ఇఫ్తార్ : 6:21 (సోమ)
సహరి : 4:47 (మంగళ)

కోడ్.. వివక్ష!

అమలులో అధికారుల పక్షపాత వైఖరి

సార్వత్రిక ఎన్నికలకు సంబం ధించి నగారా మోగడంతో శనివారం సాయంత్రం నుంచే జిల్లాలో ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులోకి వచ్చిం ది. ఎన్నికల ప్రవర్తనా నియమావళి ప్రకారం జిల్లాలోని బహిరంగ ప్రదేశాల్లో, ప్రభుత్వ కార్యాలయాల వద్ద రాజకీయ పార్టీల ఫ్లెక్సీలు, బ్యానర్ల తొలగింపు కార్యక్రమం సాగుతోంది. అయితే మోడల్ కోడ్ ఆఫ్ కాండెక్ట్‌ను (ఎంసీసీ) కఠినంగా అమలు చేయాల్సిన అధికారులు కొన్నిచోట్ల పక్షపాతం చూపడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

ఏలూరు సిటీ, మార్చి 17: ఎన్నికల ప్రవర్తనా నియమావళి నిబంధనల ప్రకారం ప్రధానంగా ప్రభుత్వ ఆస్తులపై, బహిరంగ స్థలాల్లో, వాల్ రైటింగ్, పోస్టర్లు/ పేపర్లు లేదా మేదైనా ఇతర రూపంలో కటౌట్/ హోర్డింగ్‌లు, బ్యానర్లు , జెండాలు మొదలైన వాటిని ఎన్నికల ప్రకటన వెలువడిన 24 గంటల్లోపే తొలగించాలని ఉంది. జిల్లాలోని చాలా ప్రాంతాల్లో పెక్సీలు తొలగింపు, జాతీయ నాయకుల, రాజకీయ నాయకుల విగ్రహాలకు ముసుగులు వేస్తున్నారు. ఎన్నికల

- జిల్లాలో అమల్లోకి వచ్చిన ఎన్నికల కోడ్
- ఇంకా కొనసాగుతున్న ఫ్లెక్సీల తొలగింపు

కోడ్ వచ్చి 24 గంటలు దాటుతున్నా కొన్ని ప్రాంతాల్లో ఫ్లెక్సీలు తొలగింపు పూర్తి కాలేదు. ముఖ్యంగా అధికార వైసీపీ నాయకుల ఫ్లెక్సీలు, బ్యానర్లు తొలగింపులో అధికారులు కాస్తా మీనమేషాలు లెక్కిస్తున్నారు. కొన్ని ప్రాంతాల్లో ఇంకా ప్రభుత్వ పథకాలు తెలిపే బోర్డులు దర్శనమిస్తున్నాయి.

పసుపు రంగును వదల్లేదు..

భీమడోలు : ఎన్నికల కోడ్ నిబంధనలు పాటించడంలో అధికారులు పక్షపాత వైఖరిని అనుసరిస్తున్నారని విమర్శలు వస్తున్నాయి. నిబంధనల్లో భాగంగా ప్రభుత్వ కార్యాలయాలు, బహిరంగ ప్రదేశాల్లో ఉన్న పార్టీ పెక్సీలు తొలగించి, విగ్రహా లకు ముసుగులు వేసే నేపథ్యంలో అధికార పక్షానికి ఒక విధంగా విపక్షాలకు మరో విధంగా నిబంధనలు పాటిస్తున్నారని ఆరోపణ లు వినవస్తున్నాయి. భీమడోలులోని ఎన్టీఆర్ విగ్రహానికి ముసుగులు వేసి అధికారులు ఆ విగ్రహం మంది రానికి ఉన్న పసుపు రంగును తొలగించి అత్యుత్సాహాన్ని ప్రదర్శించారు. అయితే అధికార పార్టీకి చెందిన రంగులు, పెక్సీలు తొలగించడంలో మీన మేషాలు లెక్కిస్తున్నారని టీడీపీ ఆరోపించింది. అన్ని పార్టీలకు ఒకే నిబంధనలు అమలు చేయాలని వారు డిమాం డ్ చేస్తున్నారు. రంగులు తొలగించడంపై భీమడోలు ఎంపీ డీవో స్వర్ణలతను వివరణ కోరగా ఎన్టీఆర్ మందిరానికి రంగులు తొలగించడం పొర పాటుగా జరిగిందని, మళ్ళీ రంగులు వేయిస్తామన్నారు. కోడ్ అమలులోకి వచ్చిన 72 గంటల్లోపు అన్ని పార్టీల పెక్సీలు తొలగించి, విగ్రహాలకు ముసుగులు వేసి నిబంధనలు పాటిస్తామన్నారు.

నిర్లక్ష్యం తగదు : డీపీవో

ఉంగుటూరు : ఎన్నికల కోడ్ అమలులో నిర్లక్ష్యం తగదు, ఎన్నికల నియమ నిబంధనలను తూ.చా.తప్పకుండా పాటించాలని జిల్లా పంచాయతీ అధికారి తూతిక శ్రీనివాస విశ్వ నాథ్ కైకరంలో పంచాయతీ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం సాయంత్రం ఆకస్మికంగా కైకరం విచ్చేసి ఎన్నికల కోడ్ అమలును పరిశీలిం చారు. ఈక్రమంలో గ్రామంలో ముసుగులు వేయని విగ్రహాలను చూసి కార్యదర్శి నాగేంద్ర, ఈవోపీఆర్డీ షేక్ షంషుద్దీన్‌లను పిలిచి స్వయంగా తెల్లగుడ్డ కొనిపించి తెప్పించి ముసుగు వేశారు. నారాయణ పురం సెంటర్‌ను పరిశీలించి సిబ్బందిని హెచ్చరించారు.


కైకరంలో విగ్రహాలకు ముసుగులు వేస్తున్న డీపీవో శ్రీనివాస విశ్వనాథ్


భీమడోలులో ఎన్టీఆర్ మందిరానికి తెలుపు రంగు వేసిన దృశ్యం



భీమడోలులో తొలగించని వైసీపీ సిద్ధం ఫ్లెక్సీ ...ఎమ్మెల్యే వాసుబాబు ఫ్లెక్సీ

శ్రీనివాసపురంలో..

జంగారెడ్డిగూడెం టౌన్ : ఎన్నికల షెడ్యూల్ విడుదలైన నేపథ్యంలో గత శనివారం నుంచి ఎన్నికల కోడ్ అమలులో ఉంది. అయితే మండలంలోని శ్రీనివాసపురం లో రాజకీయనాయకుల ఫ్లెక్సీలు, నాయకుల సుస్వాగతం బోర్డులపై అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోకపోవడంపై ఆదివారం నెట్టింట వార్తలు చక్కెర్లు కొట్టాయి. దీంతో అధికారులు హడావిడిగా దిద్దుబాటు చర్యలు చేపట్టి ఫ్లెక్సీలను తొలగించారు.

తూతూ మంత్రంగా..

ఏలూరు క్రైం : కేంద్ర ఎన్నికల సంఘం దేశవ్యాప్తంగా ఎన్నికల నియమావళి అమలులో ఉందంటూ ఈనెల 16వ తేదీ ప్రకటించింది. అయితే ఏలూరు నగరంలో మాత్రం ఎన్నికల నియమావళిని తూతూ మంత్రంగానే అమలు చేస్తున్నట్టు కనిపిస్తోంది. కొన్ని ప్రాంతాల్లో ప్రజా ప్రతి నిధులు వివిధ వ్యాపారాల ప్రకటనల పేరుతో హోర్డింగులపై యథేచ్ఛగానే వారి చిత్రపటాలు కనిపిస్తూనే ఉన్నాయి. ఏలూరు ప్రభుత్వాస్పత్రిలోని తల్లీ బిడ్డ ఎక్స్‌ప్రెస్‌లపై సీఎం జగన్ ఫొటోలు అదే విధంగా ఉండడంతో కొంతమంది ప్రశ్నిం చడంతో ఫొటోలు కనిపించకుండా స్టిక్కర్ అంటించారు. డాక్టర్ వైఎస్సార్ పేరు యథావిధిగానే ఉంచారు. దీంతో ఎన్నికల కోడ్‌ను తూతూ మంత్రంగానే అమలు చేస్తున్నారన్న విమర్శలు విన్పిస్తున్నాయి.


తల్లీ బిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహనాలపై సీఎం జగన్ చిత్రపటాన్ని మూశారే తప్ప డాక్టర్ వైఎస్ఆర్ అన్న పేరు మూయని దృశ్యం

కట్టుదిట్టంగా నియమావళి అమలు

- విధుల నిర్వహణలో నిర్లక్ష్యానికి తావులేదు .. కలెక్టర్ ప్రసన్న వెంకటేశ్

ఏలూరు సిటీ, మార్చి 17 : సార్వత్రిక ఎన్నికల షెడ్యూల్ విడుదలైనందున ఎన్నికల ప్రవర్తనా నియమావళిని కఠినతరం చేయాలని సంబంధిత అధికారులను జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేశ్ ఆదేశించారు. ఆదివారం స్థానిక కలెక్టరేట్‌లో ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలు ఎన్నికల నివేదికల సమర్పణ, సి-విజిల్, సువిధ యాప్, కంట్రోల్ రూమ్ నిర్వహణ, తదితర అంశాలపై ఆయా నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులు, ఎన్నికల సిబ్బందితో జాయింట్ కలెక్టర్ లావణ్యవేణితో కలిసి సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ జిల్లాలో ప్రజాస్వామ్య బద్ధంగా ఎన్నికల ప్రక్రియ నిర్వహణలో భాగంగా ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలుపై సంబంధిత అధికారులు , పర్యవేక్షక బృందాలు ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి , వ్యయ ఉల్లంఘనలను ఇతర ఏమైనా ఉల్లంఘనలను నివేదించటానికి నిర్దేశించిన సీ- విజిల్ యాప్ ద్వారా అందిన ఫిర్యాదుపై ఫిర్యాదు అందిన 100 నిమిషాల్లో స్పందించాలన్నారు. ఎన్నికల కమిషన్‌కు రోజువారీ సమర్పించాల్సిన నివేదికలు సకాలంలో సమర్పించేలా సంబంధిత అధికారులు , సిబ్బంది పూర్తి శ్రద్ధ పెట్టాలన్నారు. బహిరంగ ప్రదేశాలు , ప్రభుత్వ కార్యాలయాల్లో ఎన్నికల కమిషన్ నిషేధించిన ఫొటోలు, బ్యానర్లు వెంటనే తొలగించి సంబంధిత నివేదికలను సమర్పించాలన్నారు. ఈ విషయంలో ఎటువంటి నిర్లక్ష్యానికి తావు లేదన్నారు. ఎన్నికలకు సంబంధించిన కంట్రోల్ రూమ్, వివిధ రూపాల్లో అందిన ఫిర్యాదులను 24 గంటల్లోగా చర్యలు తీసుకోవాలన్నారు. రిటర్నింగ్ అధికారులు కూడా సి- విజిల్ యాప్ ద్వారా అందిన ఫిర్యాదులను ప్రతి రోజు పరిశీలించాలన్నారు. సువిధ యాప్ ద్వారా ఎన్నికలకు సంబంధించిన ప్రచార తదితర సంబంధించిన అనుమతులను ఆన్‌లైన్ ద్వారా సంబంధిత ఆర్వోలు అనుమతులు ఇవ్వాలన్నారు. ఎన్నికల ప్రచారానికి సంబంధించిన కరపత్రాలు, తదితర ముద్రణకు సంబంధించి అనుమతులు తప్పనిసరి అన్నారు. ఈ విషయంపై అవగాహన కల్పించేందుకు జిల్లాలోని ప్రింటర్స్ యాజమాన్యంతో సంబంధిత అర్‌ఓలు సమావేశం నిర్వహించి మార్గదర్శకాలపై అవగాహన కల్పించాలన్నారు. అసిస్టెంట్ కలెక్టర్ శ్రీపూజ, డీఆర్వో పుష్పమణి , ఆర్వోలు తదితరులు పాల్గొన్నారు.

సీఎం ఫొటో కవర్లను తొలగించి చిక్కీల పంపిణీకి చర్యలు..!

ఏలూరు ఎడ్యుకేషన్ : ఎన్నికల కోడ్ అమల్లోకివచ్చిన దృష్ట్యా పాఠశాలల విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకంలో భాగంగా అందించే చిక్కీ (వేరుశెనగ పప్పు, బెల్లం మిశ్రమంతో కూడిన అచ్చు) ప్యాక్‌లపై సీఎం జగన్ ఫొటో ముద్రించి ఉన్నందున పాలథిన్ కవర్లను చించివేసి చిక్కీలను పంపిణీ చేయాలని విద్యాశాఖ ఆదేశించినట్టు తెలిసింది. ఈ సమస్య రాష్ట్రవ్యాప్తంగా ఉన్నందున సోమవారం ఉన్నతాధికారులు ఆదేశాలిస్తారని సమాచారం. కాగా సీఎం ఫొటోతోవున్న ప్యాక్‌లను తొలగించే పనిని టీచర్లకు అప్పగించనున్నట్టు తెలుస్తోంది. దీనిపై అధికారిక స్పష్టత రావాల్సి ఉంది. టెండరుపై ప్రైవేటు ఏజెన్సీలకు చిక్కీల పంపిణీని అప్పగించగా ఇప్పటికే పాఠశాలల్లో నిల్వవున్న ప్యాక్‌ల వరకు కవర్లను తొలగించి బాలబాలికలకు అందజేయనున్నారు. ఇకమీదట ఏజన్సీ నుంచి పాఠశాలలకు పంపిణీ చేసే చిక్కీల ప్యాక్‌లపై ఎటువంటి ఫొటోలు లేకుండా చర్యలు తీసుకోవాలని సమాచారాన్ని ఇప్పటికే టెండరుదారుకు విద్యాశాఖ తెలిపినట్టు సమాచారం. దీనిపై అధికారిక ఉత్తర్వులేవీ ఆదివారం సాయంత్రం వరకు అందలేదని విద్యాశాఖవర్గాలు వెల్లడించాయి.

ఏలూరు పార్లమెంటరీ నియోజక వర్గానికి ఏఆర్వోలు, ఆర్వోల నియామకం

ఏలూరు సిటీ, మార్చి 17 : సార్వత్రిక ఎన్నికల షెడ్యూలు విడుదల కావడంతో జిల్లాలోని ఏలూరు పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలకు ఏఆర్వోలు, అసెంబ్లీ నియోజకవర్గానికి ఆర్వోలను నియమించారు.

నియోజకవర్గం	ఏఆర్వో అండ్ ఆర్వో	మొబైల్ నెంబరు
63- ఉంగుటూరు	ఆర్డీవో , ఏలూరు	9491041424
64- దెందులూరు	జేసీ, ఏలూరు	9491041415
65-ఏలూరు	స్పెషల్ డిప్యూటీ కలెక్టర్(ఎల్ఏ)	
	పీఐపీ ఆర్ఎంసి యూనిట్-2, ఏలూరు	9494511736
67-పోలవరం	పీవో, ఐటీడీఏ, కేఆర్‌పురం	9490957004
68-చింతలపూడి	ఆర్డీవో, జంగారెడ్డిగూడెం	9491041426
70- నూజివీడు	సబ్ కలెక్టర్, నూజివీడు	9849903964
73-కైకలూరు	ఎస్‌డీసీ, కేఆర్ఆర్‌సి, ఏలూరు	8500667699
	డీఆర్వో	9491041422


అమ్మవారికి పాల పొంగళ్లను నైవేద్యంగా తీసుకెళుతున్న మహిళలు

భక్తులతో పోటెత్తిన పెద్దింటమ్మ ఆలయం

కైకలూరు, మార్చి 17 : కొల్లేటికోట పెద్దింటి అమ్మవారి ఉత్సవాల్లో ఆదివారం భక్తులు పోటెత్తారు. ఈ నెల 11వ తేదీ నుంచి ప్రారంభమైన ఉత్సవాలు ఆదివారం నాటికి 7వ రోజుకు చేరాయి. ఎక్కడ చూసినా భక్తులతో ఆలయం కిటకిటలాడింది. మహిళలు కోనేరులో స్నానాలు ఆచరించి ఆలయ అధికారులు ఏర్పాటు చేసిన చలువ పందిళ్లల్లో పాలపొంగళ్ళను పొంగించి అమ్మవారికి నైవేద్యాన్ని సమర్పించారు. భక్తులు మొక్కుబడులు చెల్లించుకున్నారు. స్వచ్ఛంద సంస్థలు, దేవస్థానం ఆధ్వర్యంలో భక్తులకు ఉచితంగా మజ్జిగ, మంచినీరు సరఫరా చేశారు. చిన్నపిల్లలకు ఉచితంగా పాలును గణపవరానికి చెందిన పిన్నమరాజు వెంకట సీతారామారాజు, సునీత దంపతులు అందజేశారు. కైకలూరు రూరల్ పోలీసులు బందోబస్తు ఏర్పాట్లను నిర్వహించగా కొల్లేటికోట ప్రాథమిక ఆరోగ్యకేంద్రం ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. అమ్మవారికి పుష్పాలంకరణ, వస్త్రాలంకరణ, ఉచిత ప్రసాదాన్ని విజయవాడకు చెందిన కొయ్య వెంకటేశ్వర రావు, శివపార్వతి దంపతులు పంపిణీ చేశారు. ఆలయ అధికారి కేవీ గోపాలరావు ఆధ్వర్యంలో సిబ్బంది ఏర్పాట్లను పర్యవేక్షించారు.


ప్రత్యేక అలంకరణలో పెద్దింటమ్మ

నేటి నుంచి ఇంటర్ మూల్యాంకనం

ఏలూరు ఎడ్యుకేషన్, మార్చి 17 : ఇంటర్మీడియట్ పరీక్షల జవాబుపత్రాల ఇంగ్లీషు, తెలుగు, హిందీ, గణితం, సివిక్స్ సబ్జెక్టుల స్పాట్ వాల్యూయేషన్ క్యాంపు ఈనెల 18నుంచి ఏలూరు కోటదిబ్బలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రారంభమవుతుందని డీవీఈవో ప్రభాకరరావు ఓ ప్రకటనలో తెలిపారు. ఏలూరు జిల్లాలోని ప్రతీ కళాశాల నుంచి సంబంధిత సబ్జెక్టులకు నియమితులైన ఎగ్జామినర్లను ఆయా కళాశాలల ప్రిన్సిపాల్స్ తప్పనిసరిగా స్పాట్ క్యాంపునకు హాజరయ్యేలా రిలీవ్ చేయాలని ఆదేశించారు. ఎగ్జామినర్లందరూ సోమవారం ఉదయం 10గంటలకు స్పాట్ క్యాంపులో రిపోర్టు చేయాలని సూచించారు. ఇంటర్ బోర్డు ఆదేశాల మేరకు స్పాట్ క్యాంపులో రిపోర్టు చేయని ఒక్కో ఎగ్జామినర్‌కు రోజుకు రూ.10 వేలు చొప్పున కళాశాల యాజమాన్యానికి పెనాల్టీ విధిస్తామని హెచ్చరించారు.

కోడ్ నేపథ్యంలో స్పందన రద్దు

ఏలూరు క్రైం, మార్చి 17 : ఏలూరు జిల్లా పోలీస్ కార్యాలయంలో ప్రతి సోమవారం నిర్వహించే స్పందన కార్యక్రమాన్ని సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల నియమావళి అమలులో ఉన్నందున స్పందన కార్యక్రమం రద్దు చేస్తున్నట్లు జిల్లా ఎస్పీ మేరీ ప్రశాంతి ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి సోమవారం జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ఫిర్యాదుదారుల ఫిర్యాదులను ఏలూరులోని జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ మేరీ ప్రశాంతి స్వయంగా స్వీకరించి సంబంధించిన అధికారులకు ఆదేశాలు జారీ చేసేవారు. క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి త్వరితగతిన చర్యలు తీసుకోవాలని ఆ ఫిర్యాదులపై ఏ చర్య తీసుకున్నారో తిరిగి జవాబు పంపించాలని ఆదేశాలు ఇచ్చేవారు. సార్వత్రిక ఎన్నికల నియమావళి అమలులో ఉన్న దృష్ట్యా ఈ కార్యక్రమాన్ని రద్దు చేశారు.



ఆల్ ద బెస్ట్

నేటినుంచి పదో తరగతి పరీక్షలు

ఏలూరు ఎడ్యుకేషన్, మార్చి 17 : పాఠశాల విద్యలో విద్యార్థి భవిష్యత్తుకు తొలిమెట్టుగా పరిగణించే పదో తరగతి పబ్లిక్ పరీక్షలు సోమవారం నుంచి ప్రారంభమవుతు న్నాయి. ఈ పరీక్షలకు జిల్లాలో పకడ్బందీ ఏర్పాట్లు చేయగా, ఆకస్మిక పరిశీలనకు ప్రభుత్వ పరీక్షల డైరెక్టర్ దేవానంద్‌రెడ్డి ఆదివారం ఏలూరు రావడం గమనార్హం. రెండేళ్ల క్రితం టెన్త్ పరీక్షల్లో ప్రశ్నాపత్రం లీకేజీ, సంబంధిత ఉపాధ్యాయులపై అభియోగాలు మోపడం, సస్పెన్షన్లు తదితర అవాంఛనీయ పరిణామాలు పునరావృతం కాకుండా ఈ దఫా మరిన్ని చర్యలు చేపట్టారు.

జిల్లాలో పదో తరగతి పరీక్షలకు ఈ ఏడాది మొత్తం 32,355 మంది బాలబాలికలు దరఖాస్తు చేసుకోగా, వీరికి పంపిణీ చేసే ప్రతీ ప్రశ్నాపత్రం పైనా యూనిక్ కోడ్ నెంబరును ముద్రించడం విశేషం. ఈ సంఖ్యద్వారా ఎక్కడైనా పరీక్ష కేంద్రంలో పేపరు లీకైతే వెంటనే సంబంధిత పరీక్ష గది, కేంద్రం వివరాలు తెలుసుకునేలా ఇందులో వీలుంటుం ది. దీనివల్ల తక్షణమే లీకులకు బాధ్యులను గుర్తించి, పరీక్ష కేంద్రం ఇన్విజిలేటర్, చీఫ్ సూపరింటెండెంట్‌లపై చట్టపరమైన చర్యలు తీసుకునేలా ఏర్పాటు ఉంటుందని డీజీఈ దేవానంద్‌రెడ్డి వెల్లడించారు. పరీక్షలు ఈ నెల 30న ముగియనుండగా, ఆ మరుసటిరోజు నుంచే మూల్యాంకనను చేపట్టి ఏప్రిల్ 8లోగా పూర్తి చేయాలని నిర్ణయించారు. అన్ని పరీక్షా కేంద్రాలను 'నో మొబైల్ జోన్' గా ప్రకటించారు. సిబ్బంది ఎవరైనా సెల్‌ఫోన్ తెస్తే పరీక్షకేంద్రం గేటువద్ద పోలీసులకు స్వాధీనం చేయాల్సి ఉంటుంది.

144వ సెక్షన్ అమలు

పరీక్షా కేంద్రాల వద్ద జనం గుంపులుగా ఉండకుండా 139 కేంద్రాల వద్ద 144వ సెక్షన్‌ను విధించారు. పరీక్షార్థుల్లో బాలురు 16,760 మంది, బాలికలు 15,595 మంది ఉన్నారు. పరీక్షలపై ఏవైనా సందేహాలు, ఫిర్యాదులుంటే డీఈవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన కంట్రోల్‌రూమ్ ఫోన్‌నెంబరు 81218 40400కు తెలియజేయవచ్చు. హాల్ టిక్కెట్‌లో విద్యార్థి ఫొటోప్రింటు కాకపోయినా, తప్పు ఫొటోవచ్చినా లేదా ఫొటో సరిగా కనిపించకపోయినా విద్యార్థి తాజా ఫొటోను అంటించి సంబంధిత స్కూల్ హెచ్‌ఎం ధ్రువీకరించి ఇవ్వాలని విద్యాధికారులు ఆదేశించారు. పరీక్ష ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు జరుగుతుంది. పరీక్ష ముగిసేవరకు విద్యార్థులెవరినీ బయటకు పంపరు. అన్ని పరీక్షకేంద్రాల్లో తాగునీరు, ఫ్యాన్లు, ట్యూబ్‌లైట్లు, ప్రథమ చికిత్సాకేంద్రాలు, టాయిలెట్లు ఉండేలా చర్యలుతీసుకున్నట్టు డీఈవో ఎస్.అబ్రహం వివరించారు.

- రాష్ట్రంలోనే అతితక్కువ అభ్యాసకులతో 'ఓపెన్' దూరవిద్య పరీక్షలు !

ప్రతీ 'ఓపెన్' పరీక్షా కేంద్రానికి ఒక సిట్టింగ్ స్క్వాడ్ !

రెగ్యులర్ విద్యార్థులకు పరీక్షలతో పాటే, సార్వత్రిక దూరవిద్యా విధానంలో పదో తరగతి, ఇంటర్ పరీక్షలకు దరఖాస్తు చేసుకున్న అభ్యాసకులకు కూడా వార్షిక పరీక్షలు సోమవారం నుంచే ప్రారంభమవుతున్నాయి. జిల్లా ఓపెన్ స్కూల్స్ పరీక్షలకు కేవలం 250 మంది దరఖాస్తు చేసుకోగా పరీక్షలకు ఏడుకేంద్రాలను ఎంపిక చేశారు. ఇంటర్ పరీక్షలకు 9కేంద్రాల్లో 206మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారు. ఈనెల 27వరకు జరిగే 'ఓపెన్' పరీక్షలు మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు జరుగుతాయి. మాస్ కాపీయింగ్/ మాల్ ప్రాక్టీస్‌కు అవకాశం ఉంటుందంటూ ఓపెన్ స్కూల్స్ దూరవిద్య పరీక్షలపై ఆరోపణలుండగా, రెండేళ్లుగా ఎటువంటి అవకతవకలకు తావులేకుండా సునిశిత నిఘా మధ్య నిర్వహిస్తున్న ఈ పరీక్షలకు వరుసగా రెండోఏడాది ఏలూరు జిల్లా నుంచి అత్యల్పంగా పరీక్షార్థులు ఉండడం రాష్ట్రంలోనే జిల్లాకు పేరు లభించడం గమనార్హం. దీనికనుగుణంగానే జిల్లాలో ఓపెన్ స్కూల్స్ దూరవిద్య టెన్త్, ఇంటర్ పరీక్షల ఫలితాలు రెండేళ్లుగా రాష్ట్రంలోనే అట్టడుగున ఉండటం విశేషం. దీంతో జిల్లాకు చెందిన అభ్యాసకులు పెద్దసంఖ్యలోనే పొరుగు జిల్లాల్లో అడ్మిషన్లు పొందడం, పరీక్షాకేంద్రాలను కూడా అక్కడివే ఎంపిక చేసుకోవడం రాష్ట్రంలో చర్చనీయాంశమైంది. ఓపెన్ దూరవిద్య పరీక్షలకు ఈ దఫా జిల్లాలో అన్ని పరీక్షా కేంద్రాల్లో ఒక్కో సిట్టింగ్ స్క్వాడ్‌ను నియమించడం మరో విశేషం.


ఏలూరు కేపీడీటీ హైస్కూలు పరీక్షకేంద్రంలో ఏర్పాట్లను తనిఖీచేస్తున్న ప్రభుత్వ పరీక్షల డైరెక్టర్ దేవానంద్‌రెడ్డి

ఆంధ్రా- తెలంగాణ సరిహద్దులో..

పేకాట జోరు

- తెలంగాణ నుంచి జూదరుల రాక
- చేతులు మారుతున్న లక్షలాది రూపాయలు

కుక్కునూరు, మార్చి 17 : ఆంధ్రా తెలంగాణ సరిహద్దు ప్రాంతమైన వేలేరు గ్రామం వెనుక నుంచి నడిగూడెం వెళ్లే రహదారి పక్కన ఓ తోటలో పేకాట స్థావరం ఏర్పాటు చేశారు. తెలంగాణ నుంచి వస్తున్న పలువురు జూదరులు ఇక్కడ పేకాటలో పాల్గొంటున్నట్టు సమాచారం. రోజూ లక్షలాది రూపాయలు చేతులు మారుతున్నట్టు తెలుస్తోంది. స్థానికంగా ఉన్న పలు రాజకీయ పార్టీల నాయకులు కనుసన్నల్లోనే వారం రోజులుగా పేకాట శిబిరం నిర్వహిస్తున్నట్టు సమాచారం. ఈ సమాచారం తెలియడంతో ఆదివారం విలేకరుల బృందం వెళ్లగా అప్పటికే జూదరులు అక్కడ నుంచి జారుకున్నారు. స్థావరంలో ఫ్యాన్లు, లైట్లు, టేబుల్స్ ఏర్పాటు చేసుకున్నారు. ఘటనా స్థలంలో పేకముక్కలు పడి ఉన్నాయి. పగలు ఇక్కడ నిర్వహిస్తూ రాత్రి సమయంలో సోలార్ లైటింగ్‌తో ఏర్పాటు చేసుకున్న మరో స్థావరంలో యథేచ్ఛగా పేకాట నిర్వహిస్తున్నట్టు తెలుస్తోంది. తెలంగాణ నుంచి కారు, ద్విచక్ర వాహనాలపై రావడం వాటిని స్థావరానికి దూరంగా పార్కింగ్ చేసి పేకాట నిర్వాహకులు ఏర్పాటు చేసే వాహనాల్లో పేకాట స్థావరానికి చేరుకుంటున్నట్టు స్థానికుల సమాచారం. గతంలో కూడా ఇక్కడ భారీ స్థాయిలో పేకాట నిర్వహణ జరిగింది. అప్పుడు స్థానిక పోలీసులు పట్టించుకోకపోవడంతో పలువురు జిల్లా పోలీసు అధికారులకి ఫిర్యాదు చేయడంతో ఏలూరు నుంచి ప్రత్యేక పోలీసు బృందాలు వచ్చి దాడి చేశాయి. కార్లు, ద్విచక్ర వాహనాలు, లక్షలాది నగదు, పలువురు వ్యక్తులు పట్టుబడ్డారు. మళ్లీ ఆ స్థాయిలో పేకాట జరుగుతున్నట్టు సమాచారం. మరోవైపు దాచారం, గొమ్ము గూడెం జోరుగా కోడిపందేలు జరుగు తున్నాయి. అధికారులు చర్యలు తీసుకుని జూదాలను అరికట్టాలని స్థానికులు కోరుతున్నారు.


తెలంగాణ సరిహద్దు గ్రామంలో పేకాట స్థావరం


ఘటనా స్థలంలో పేక ముక్కలు


తొడగొడుతున్న యువతి..


పల్నాడు జిల్లా బొప్పూడి ప్రజాగళం సభకు హాజరైన జనం


ప్రజాగళం సభలో ప్రసంగిస్తున్న చంద్రబాబు, మోదీ, పవన్


ప్రజాగళం సభకు వస్తున్న అమరావతి మహిళలు

ప్రజాగళం.. ప్రభంజనం

జనం జనం ప్రభంజనం.. బొప్పూడి ప్రజాగళం జనసంద్రమైంది. ఆదివారం భానుడు భగభగ మండిస్తున్నా తగ్గేదిలేదన్నట్లుగా తరలివచ్చిన అశేష జనం హర్షాతిరేకాలతో బొప్పూడి సభా ప్రాంగణం దద్దరిల్లింది. బొప్పూడికి ఇటు చిలకలూరిపేట, అటు మార్టూరు వరకు 16వ నెంబరు జాతీయ రహదారి జనంతో నిండిపోయింది. యువకులు వృద్ధులు, మహిళలు పిల్లలు అన్న తేడా లేకుండా అన్ని వర్గాల వారు కూటమి జెండాలు చేబూని బొప్పూడి వైపు కదలిరావడంతో జాతీయ రహదారిపై జన సునామీ ఆవిష్కృతమైంది. చలో బొప్పూడి అంటూ కార్యకర్తలు, నేతలు, అభిమానులు ఒక ప్రవాహంలా తరలిరావడంతో మధ్యాహ్నం మూడు గంటలకే సభా ప్రాంగణం మొత్తం జనంతో కిటకిటలాడింది. జనసునామీని చూసిన అధినేతలు ఆనందపరవశులయ్యారు. మోదీ అయితే చంద్రబాబును ప్రత్యేకంగా అభినందించారు. బొప్పూడి వేదికగా త్రిమూర్తులైన ప్రధాని నరేంద్రమోదీ, టీడీపీ, జనసేన అధి నేతలు చంద్రబాబు, పవన్‌కల్యాణ్ ఎన్నికల శంఖారావం పూరించారు. అభివృద్ధి లేక అప్పులు.. దోపిడీ దాష్టీకాలు.. అవినీతి అప్రజాస్వామిక పాలనను అంతం పలకాలని నేతలు పిలిపిచ్చారు. జెండాలు వేరైనా అజెండా ఒకటేనని.. అభివృద్ధి, సంక్షేమం, ప్రజాస్వామ్య పరిరక్షణ కావాలంటే కూటమికి ఓటేసి ఆశలు, ఆకాంక్షలు, సాకారం చేసుకోవాలని సందేశమిచ్చారు. - చిలకలూరిపేట






ప్రజాగళం సభలో మూడు పార్టీల అభిమానులు


ఉత్సాహంగా యువతులు..


బాబు,పవన్, పురంధేశ్వరి అభివాదం...


మోదీతో బాబు మాటామంతీ..


జానపదుల నృత్యాలు..


మహిళలు, కార్యకర్తల ఉత్సాహం..





క్రైం కార్నర్

యజమాని తిట్టాడని వాటర్ ట్యాంకు ఎక్కాడు..

తణుకు, మార్చి 17 : తణుకు రూరల్ పోలీసు స్టేషన్ సమీపంలో ఉన్న వాటర్ ట్యాంకు ఎక్కి ఆదివారం సాయంత్రం ఓ వ్యక్తి హల్‌చల్ చేశాడు.తణుకు మండలం వేల్పూరు గ్రామానికి చెందిన యరమాటి సత్యనారాయణను తాను పనిచేస్తున్న యజమాని దుర్భాషలాడాడంటూ పోలీసు స్టేషన్ సమీపంలో ఉన్న వాటర్ ఎక్కాడు. దీంతో పోలీసులు,అగ్నిమాపక సిబ్బంది సహాయంతో కిందకు దించడానికి ప్రయత్నించారు. యజమాని దుర్గాప్రసాదు వచ్చి మాట్లాడిన తర్వాత కిందకు దిగాడు. దీంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

నడిపల్లిలో తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ

నాలుగు కిలోల వెండి, ఐదు కాసుల బంగారం అపహరణ

పెదవేగి, మార్చి 17 : తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ జరిగింది. తాళాలు పగుల గొట్టి, ఇంట్లో వెండి, బంగారు ఆభరణాలను చోరీ చేశారు. పెదవేగి ఎస్ఐ వి.రాజేంద్రప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం నడిపల్లి గ్రామానికి చెందిన మేకా రమేష్ కుటుంబ సభ్యులంతా కలిసి వారంరోజుల కిందట హైదరాబాద్ వెళ్ళారు. ఇంటి తలుపులు తెరిచి ఉన్నాయని గమనించిన స్థానికులు శనివారం సాయంత్రం హైదరాబాద్‌లో ఉన్న రమేష్‌కు సమాచారం అందించారు. దీంతో ఆదివారం ఉదయానికి నడిపల్లి చేరుకున్న రమేష్ ఇంట్లో నాలుగు కిలోల బరువైన మూడు వెండి పళ్ళాలు, ఐదు కాసుల బంగారు ఆభరణాలు, రూ.ఐదువేలు నగదు చోరీకి గురైనట్లు గుర్తించి పెదవేగి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

బస్సు ఢీకొని వృద్ధురాలి మృతి

పెదవేగి, మార్చి 17 : పెదవేగి మండలం చక్రాయగూడెంలో శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో వృద్ధురాలు మృతి చెందినట్టు పెదవేగి ఎస్ఐ వి.రాజేంద్రప్రసాద్ తెలిపారు. గ్రామానికి చెందిన బోట్ల వీరమ్మ శనివారం రాత్రి ఎనిమిది గంటల సమయంలో ఏలూరు- జంగారెడ్డిగూడెం రహదారిని దాటుతోంది. జంగారెడ్డిగూడెం నుంచి ఏలూరు వైపు వస్తున్న ఆర్టీసీ బస్సు ఆమెను ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడ్డ ఆమెను ఏలూరు సర్వజన ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ చెప్పారు.

ప్రేమించి మోసగించిన యువకునిపై కేసు

ఏలూరు క్రైం, మార్చి 17 : ఒక యువతిని ప్రేమించి పెళ్లి చేసుకుంటానని నమ్మించి గర్భవతిని చేసి ముఖం చాటేసిన యువకునిపై ఏలూరు త్రిటౌన్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. ఏలూరులోని ఒక ప్రాంతానికి చెందిన యువతి ఆసుపత్రిలో నర్సుగా పనిచేస్తున్నది. నూజివీడు గాంధీనగర్‌కు చెందిన పురమా సాయిబాబు (30) తరచుగా పేషెంట్లను ఆ ఆసుపత్రికి తీసుకువస్తూ ఆ నర్సుతో పరిచయం పెంచుకుని ఆ పరిచయాన్ని ప్రేమగా మార్చాడు. పెళ్ళి చేసుకుంటానని నమ్మించి ఆమెను గర్భవతిని చేసి ఆపై అబార్షన్ చేయించాడు. పెళ్ళి మాటెత్తితే నిరాకరించాడు.దీంతో బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఏలూరు త్రిటౌన్ సీఐ వెంకటేశ్వరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రెండు తలల పాము హతం



పోలవరం, మార్చి 17 : అరుదైన రెండు తలల పాముని పోలవరంలో గ్రామ స్థులు ఆదివారం ఉదయం చంపివేశారు. పోలవరం తహసీల్దారు కార్యాలయానికి వెళ్లే మార్గంలో స్టేట్ బ్యాంకు సమీపంలో పంటపొలాల నుంచి రోడ్డు దాటుతున్న రెండు తలల పాముని స్థానికులు ఇటుకలతో కొట్టి చంపారు. అటవీక్షేత్రాధికారి దావీదురాజు మాట్లాడుతూ రెండు తలల పాముగా పిలవబడే రెడ్ శాండ్ బోవా విష రహిత పాము అని ప్రమాదకారి కాదన్నారు. ప్రజలు అవగాహన లేక అరుదైన సర్ప జాతులను కొట్టి చంపుతున్నారన్నారు. నివాసాల పరిసర ప్రాంతాలలో పాములు కనిపించినప్పుడు అటవీశాఖ అధికారులకు సమాచారమిస్తే వాటిని తమ వద్ద ఉన్న నూతన పరికరాల ద్వారా పట్టి అడవుల్లో వదులుతామన్నారు.


ఏలూరులో పరీక్ష కేంద్రాల వద్ద తనిఖీ చేస్తున్న ఎస్పీ మేరీ ప్రశాంతి


ఏలూరులో రూమ్ నంబర్లు తెలుసుకుంటున్న అభ్యర్థులు

గ్రూప్-1 పరీక్షలు ప్రశాంతం

భీమవరం రూరల్ / ఏలూరు కలెక్టరేట్ /ఏలూరు క్రైం/ తాడేపల్లిగూడెం రూరల్ / భీమవరం క్రైం / నరసాపురం టౌన్ మార్చి 17 : ఉమ్మడి జిల్లాలో ఆదివారం జరిగిన ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ గ్రూప్ -1 పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. పశ్చిమ గోదావరి జిల్లాలో ఏడు పరీక్షా కేంద్రాలు, ఏలూరు జిల్లాలో ఐదు కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించగా పశ్చిమలో 62.20 శాతం, ఏలూరులో 62.85 శాతం మంది హాజరైనట్టు అధికారులు తెలిపారు. పశ్చిమ గోదావరి జిల్లాలో నిర్వహించిన ఉదయం పేపరు-1 పరీక్షకు 4,209 మంది దరఖాస్తు చేసుకోగా 2,618 మంది హాజరయ్యారని, 1591 మంది గైర్హాజరయ్యారని 62.20 శాతం నమోదైనట్లు జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ గాంధీ తెలిపారు. మధ్యాహ్నం పేపరు -2 పరీక్షకు 4,209 మందికి 2596 మంది హాజరవగా 1613 మంది గైర్హాజరయ్యారని తెలిపారు. పరీక్షల అనంతరం ప్రశ్నాపత్రాలు, ఓఎంఆర్ షీట్లు, ఇతర పరీక్షా సామాగ్రి పూర్తి బందోబస్తుతో స్ట్రాంగ్ రూమ్‌కి తదుపరి ఏపీపీఎస్సీ అధికారులు ప్రత్యేక భద్రతతో విజయవాడ తరలించనున్నట్టు తెలిపారు. ఏలూరు జిల్లాలో 4,371 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకోగా ఉదయం 2747 మంది మధ్యాహ్నం 2732 మంది హాజరయ్యారు. మొత్తం 15 మంది గైర్హాజరైనట్టు జేసీ లావణ్య వేణి తెలిపారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రశాంతంగా పరీక్షల నిర్వహణ చేపట్టినట్టు తెలిపారు.ఏలూరులో పరీక్షా కేంద్రాలను జిల్లా ఎస్పీ ఆదివారం తనిఖీ చేశారు. అభ్యర్థులను క్షుణ్ణంగా మెటల్ డిటెక్టర్‌లతో పరిశీలించారు. ఎలాంటి ఎలక్ట్రానిక్ పరికరాలు, వాచీలు, సెల్ ఫోన్లు తీసుకు వెళ్లకుండా చర్యలు తీసుకున్నారు. నగరంలో ట్రాఫిక్‌నకు అంతరాయం లేకుండా అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. భీమవరంలో పరీక్ష కేంద్రాలను జిల్లా అదనపు ఎస్పీ (అడ్మిన్) భీమారావు తనిఖీ చేశారు. ట్రాఫిక్ పోలీస్‌లు అభ్యర్థులకు ఏవిధమైన ట్రాఫిక్ అంతరాయం కలగకుండా తగిన ఏర్పాట్లు చేశారని, తగిన పటిష్టమైన బందోబస్తు ఏర్పాట్లు చేసినటు తెలి పారు. తాడేపల్లిగూడెం మండలం పెదతాడేపల్లి వాసవీ ఇంజనీరింగ్ కళా శాలలో 52.5 శాతం మంది పరీక్షలకు హాజరైనట్టు పరీక్షల కేంద్రం సూపరింటెండెంట్ డాక్టర్ రత్నాకరావు తెలిపారు. ఉదయం 739 మందికి 662 మంది, సాయంత్రం 1401 మందికి 733 మంది హాజరైనట్టు వివరించారు. రూరల్ సీఐ రమేష్ బందోబస్తు ఏర్పాటు చేశారు. నరసాపురం వైఎన్ కళాశాలలో ప్రశాంతంగా ముగిశాయి. సెంటర్ వద్ద గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. అరగంట ముందుగానే పరీక్ష కేంద్రం వద్దకు చేరుకున్నారు.






నరసాపురంలో చెక్ చేస్తున్న పోలీసు... భీమవరం డీఎన్ఆర్ వద్ద పరిశీలిస్తున్న అదనపు ఎస్పీ... పెదతాడేపల్లి వాసవీ కళాశాల వద్ద అభ్యర్థులు

ఆన్‌లైన్ సేవల్లో ఇబ్బందులు

రుణాలకు సంబంధించి తరచూ ఫోన్‌లు

ఎస్‌బీఐ ఖాతాదారుల్లో అసహనం



పాలకొల్లు, మార్చి, 17: ఆన్‌లైన్‌లో నాణ్యమైన సేవలు అందడం లేదని తరచూ ఇబ్బందులు ఇదురవుతున్నాయని ఎస్‌బీఐ ఖాతా దారుల నుంచి విమర్శలు వినిపిస్తున్నాయి. ముఖ్యంగా లోన్ అకౌంట్స్ ఈఎంఐల చెల్లిం పుల విషయంలో సాఫ్ట్‌వేర్ మరీ అధ్వానంగా తయారైందని పలువురు చెబుతున్నారు. ఇటీవల పాలకొల్లు ఎస్‌బీఐ ప్రధాన బ్రాంచ్‌లో రామారావు అనే వ్యక్తి గృహ రుణం రూ.12 లక్షలు తీసుకున్నారు. 2022 ఆర్థిక సంవత్సరాంతానికి తీసుకున్న రుణంలో రూ.16 వేలు మాత్రమే బాకీ ఉంది. రుణ వ్యవధి ఎక్కువ కాలం ఉండటంతో ఈఎంఐ నామమాత్రం చేసి రూ.5 వందలుగా నిర్ణయించారు. గత ఫిబ్రవరి నెలాఖరు నాటికి తీసుకున్న రుణంలో రూ.4 వేలు మాత్రమే బాకీ ఉండగా ఈఎంఐ రూ.30,419 కట్టాలంటూ ఎస్ఎంఎస్ పంపించడమే కాకుండా సేవింగ్ ఖాతాను హోల్డ్ చేశారు. వాస్తవంగా బాకీ రూ.4 వేలు ఉన్నప్పటికీ రూ.30 వేలు బాకీ చూపి హోల్డులో పెట్టడంతో ఇబ్బంది పడ్డానని రామారావు తెలిపారు. మురళీకృష్ణ అనే వ్యక్తి తీసుకున్న గృహ రుణంపై నెలనెలా ఈఎంఐ చెల్లిస్తున్నప్పటికీ బ్యాంక్ నుంచి ఫోన్‌లు చేసి మీ ఖాతా ఖాళీ అయిపోతుందంటూ మానసిక వేదనకు గురి చేస్తున్నారని వాపోయారు. రుణం తీసుకున్న బ్యాంక్ నుంచి ఒకసారి, హెడ్డాఫీసు నుంచి అంటూ ఒకసారి థర్డ్ పార్టీ వ్యక్తుల నుంచి మరోసారి ఫోన్‌లు చేసి నరకం చూపిస్తున్నారంటూ పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పండుగలు, పబ్లిక్ హాలీడేస్‌లలో ఫోన్ చేసి ఇబ్బంది పెట్టవద్దని రిజర్వ్ బ్యాంక్ గట్టిగా చెప్పినప్పటికీ పలు బ్రాంచ్‌లతో రాత్రనక పగలనక ఫోన్‌లు చేస్తూ ఇబ్బం దులు పెడుతున్నారని పలువురు రుణగ్రహీతలు వాపోతున్నారు.

కుమార్తెపై అత్యాచారయత్నం

ఆగిరిపల్లి, మార్చి 17: ఆగిరిపల్లి మండలంలోని ఒక గ్రామానికి చెందిన 14 ఏళ్ల బాలికపై ఆమె తండ్రి ఇంట్లో ఎవరూలేని సమయంలో అత్యాచారానికి యత్నించగా ఆమె భయపడి కేకలు వేసింది. కేకలు విన్న బాలిక పిన్ని రావడంతో తండ్రి పరారైనట్టు ఎస్ఐ సురేంద్రబాబు తెలిపారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

ద్వారకా తిరుమలలో వీధి కుక్కల భయం



ద్వారకా తిరుమల, మార్చి17: డెర్మటైటిస్ వ్యాధి బారిన పడిన వీధి శునకాలు ద్వారకాతిరుమలలో స్థానికులను హడలెత్తిస్తున్నాయి. కొండపై అన్నప్రసాద భవనం వద్దకు వెళ్లిన ఓ భక్తుడిపై శునకం దాడి చేసి వేలు కొరకడంతో భక్తులు భయపడిపోతున్నారు. ఇక్కడ వీధి కుక్కలకు తీవ్రమైన చర్మవ్యాధి సోకి మృత్యువాత పడుతున్నాయి. శరీరంపై ఒంటినిండా పుండ్లు పడి వాటి నుంచి రక్తం కారుతూ అవి వికృతంగా మారాయి.ఇవి దగ్గరకు వస్తున్నాయంటేనే జనాలు భయాందోళనలతో పరుగులు తీస్తున్నారు. ఇప్పటికే వీధికుక్కల ద్వారా ఈ స్కిన్ ఇన్ఫెక్షన్ కొన్ని పెంపుడు కుక్కలకు వాటి నుంచి యజమానులకు కూడా సోకింది. దీంతో వారు చికిత్స పొంది వాటిని దూర ప్రాంతాలకు తీసుకెళ్లి విడుస్తున్నట్లు సమాచారం.

వ్యాధి తీవ్రత గుర్తించాలి

పంచాయతీ పరిధిలో వందలాదిగా సంచరించే శునకాల్లో అధికశాతం కుక్కలకు



డెర్మటైటిస్ బారిన శునకాలు

భయాందోళనలో ప్రజలు

ఈ చర్మవ్యాధి ఇప్పటికే సోకింది. చాలా రోజులుగా ఇవి వ్యాధి తీవ్రతతో బాధపడుతున్నా పంచాయతీ అధికారులు, పాలకులు పట్టించుకోవడం లేదు. పలుప్రాంతాల్లో ఇవి గుంపులు గుంపులుగా స్వైర విహారం చేస్తున్నాయి. వ్యాధిబారిన పడిన శునకం తిన్న ఆహారాన్ని, తాగిన వాటిని వేరే శునకం తింటే వాటికీ ఈ ఇన్ఫెక్షన్ సోకుతోంది.

ఇది అంటువ్యాధి



శునకాలకు వచ్చిన ఈ చర్మవ్యాధిని డెర్మటైటిస్ అంటారు. శుభ్రత లేని కారణంగా మరింతగా వాటికి బ్యాక్టీరియా సోకి చివరకు మృత్యువాత పడుతున్నాయి. పెంపుడు కుక్కల యజమానులు జాగ్రత్తలు పాటించాలి. ద్వారకాతిరుమలలో అధికశాతం కుక్కలకు ఈ వ్యాధి సోకింది. వేరే కుక్కలతో ఇవి తిరగడం వల్ల ఆ వ్యాధి వీటికీ అంటుతోంది.
- అంగర సురేష్, మండల పశువైద్యాధికారి, ద్వారకాతిరుమల

రాట్నాలమ్మకు ప్రత్యేక పూజలు


అమ్మవారికి పూజలు చేస్తున్న భక్తులు

పెదవేగి, మార్చి 17: రాట్నాల కుంట రాట్నాలమ్మకు ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని, పాలపొంగలి నైవేద్యం సమర్పించారు. అర్చకులు పావులూరి రామ సత్యనారాయణశర్మ, రుద్రపాక శేషగిరిరావు, పావులూరి పూర్ణయ్యశర్మ, చావలి సాయి అమ్మవారికి లలితా సహస్రనామ దేవీ ఖడ్గమాలార్చన చేశారు. పూజా టికెట్ల విక్రయాల ద్వారా రూ.38,025, లడ్డూ ప్రసాదాల విక్రయాల ద్వారా రూ.25,200, ఫోటో విక్రయాల ద్వారా రూ.3300 ఆదాయం వచ్చిందని ఆలయ ఈవో ఎస్.సతీష్‌కుమార్ తెలిపారు. ఆలయ అభివృద్ధికి భక్తులు రూ.16,553 విరాళాలు అందించారని ఆయన చెప్పారు.

ఘనంగా కావమ్మ, మారయ్య స్వామి ఉత్సవాలు


కావమ్మ, మారయ్యస్వామి

ఏలూరు కల్చరల్, మార్చి 17: స్థానిక బెనర్జీపేటలో కావమ్మ తల్లి మారయ్యస్వామి ఉత్సవాలు ఆదివారం నిర్వహించారు. స్వామి, అమ్మవారికి విశేష పూజలు, కుంకుమార్చన చేశారు. ఆలయాన్ని సుందరంగా అలంకరించారు. ప్రాంగణం అమ్మవారి నామస్మరణతో మార్మోగింది. అనంతరం ఆలయ ప్రాంగణంలో అన్న సమారాధన నిర్వహించారు.

నేడు పాటిమ్మ ఆలయ వార్షికోత్సవాలు ప్రారంభం

దెందులూరు, మార్చి 17: సంతాన లక్ష్మిగా పేరు పొందిన చల్లచింతలపూడి, పెరుగుగూడెం గ్రామాల మధ్య వెలసిన పాటిమ్మతల్లి ఆలయ వార్షికోత్సవాలు సోమవారం ప్రారంభమవుతాయి. 108 మంది ముత్తైదువులు కలశాలతో పెరుగుగూడెం నుంచి పుట్టింటి సారె తీసుకెళతారు. యలమర్తి శ్రీనివాస్, హేమలత దంపతుల ఆధ్వర్యంలో బోనాలతో ఊరేగింపుగా వెళ్లి అమ్మవారికి జలాభిషేకం అనంతరం పంచామృతాలతో అభిషేకాలు నిర్వహిస్తారు.

చిన వెంకన్నను దర్శించిన హోం మంత్రి వనిత


మంత్రికి ప్రసాదాలను ఇస్తున్న అర్చకులు

ద్వారకాతిరుమల, మార్చి17: చిన వెంకన్న ఆలయాన్ని హోం మంత్రి తానేటి వనిత ఆదివారం సందర్శించారు. గోపాలపురం నియోజవర్గ వైసీపీ అభ్యర్థిగా టికెట్ ఖరారైన సందర్భంగా ఆమె శ్రీవారికి మొక్కుకున్నారు. ముందుగా స్వామి, అమ్మవార్లను దర్శించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అర్చకుల నుంచి వేదాశీర్వచనం, ప్రసాదాలను పొందారు.

సీఏఏ అమలు చేయబోమని ప్రకటించాలి


రౌండ్ టేబుల్ సమావేశంలో నేతలు

ఏలూరు టూటౌన్, మార్చి 17: రాష్ట్రంలో సీఏఏ అమలు చేయబోమని అధికార ప్రతిపక్ష పార్టీలు ప్రకటించాలని రౌండ్ టేబుల్ సమావేశం డిమాండ్ చేసింది. అంజుమాన్ పంక్షన్ హాలులో సీపీఎం నగర కార్యదర్శి కిషోర్ అధ్యక్షతన ఆదివారం రౌండ్‌టేబుల్ సమావేశం జరిగింది. సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి, సీపీఐ రాష్ట్ర కంట్రోల్ మిషన్ కార్యదర్శి బండి వెంకటేశ్వరరావు, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు రాజనాల రామ్మోహన రావు, హమ్‌ఆద్మీ పార్టీ అధ్యక్షుడు షేక్ మస్తాన్, జమాతే ఇస్లాం అధ్యక్షుడు ఇస్మాయిల్ షరీఫ్, బీఎస్పీ నాయకులు రత్నబాబు పాల్గొన్నారు. వీరంతా మాట్లాడుతూ బీజేపీ, ఆర్ఎస్ఎస్ దేశ ప్రజలను మతప్రాదిపదికన విడగొట్టాలని చూస్తున్నాయన్నారు. సరిహద్దు దేశాల నుంచి వచ్చిన వారికి మాత్రమే పౌరసత్వం ఇస్తానడం మానవత్వం కాదన్నారు. రాష్ట్రంలో సీఏఏ అమలు చేయవద్దన్నారు.

భవన నిర్మాణ కార్మికులకు 40వేల క్లెయింలు చెల్లించాలి


నూతన కార్యవర్గ సభ్యులు

ఏలూరు రూరల్, మార్చి 17: రాష్ట్రంలో భవన నిర్మాణ కార్మికులకు దాదాపు 40 వేల క్లెయింలు పెండింగ్‌లో ఉన్నాయని, వెంటనే చెల్లించాలని ప్రైవేట్ ఎలక్ట్రికల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు లింగమల్లు శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. యూనియన్ వార్షికోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. శ్రీనివాసరావు మాట్లాడుతూ రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం సంక్షేమ బోర్డును ఎత్తివేసిందన్నారు. దాదాపు 40వేల క్లెయింలు పెండింగ్‌లో ఉండగా, ఒక్క రూపాయి చెల్లించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. సంక్షేమ బోర్డులో నిధులను మళ్లించి అన్యాయం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. డీవోసీ పునరుద్ధరించి భవన నిర్మాణ సంస్థల్లో నిధులు కార్మికులకే చెల్లించాలని డిమాండ్ చేశారు. నగరశాఖ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా లింగమల్లు శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శిగా బత్తిన శ్రీనివాసరావు, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా ఎం.శంకర్‌రావు, కోశాధికారిగా కె.ప్రసాదరావు, ఉపాధ్యక్షులు కె.దేవరాజు, నేమాల కృష్ణ, ఎల్.వాసుదేవరావు, సహాయకార్యదర్శిగా కాకర్ల శ్రీనివాస్, సహదేవుడు, ముంగర సాయికృష్ణ, నాగేశ్వరరావు, సభ్యులుగా బాలకృష్ణ, సత్యనారాయణ, కోడి రవి, శ్రీనివాసరాజు, రమేష్‌ను ఎన్నుకున్నారు. సమావేశంలో ఆర్గనైజింగ్ కార్యదర్శి రాజ్‌కుమార్, కాకి నాని తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో వాహనాల తనిఖీ


వాహనాలు తనిఖీ చేస్తున్న ఎస్ఐ

ఏలూరు క్రైం, మార్చి 17: ఎస్పీ మేరీ ప్రశాంతి ఆదేశాల మేరకు జిల్లాలో పలు చోట్ల వాహనాలు తనిఖీ చేశారు. వన్‌టౌన్ సీఐ ఎస్.రాజశేఖర్ ఆధ్వర్యంలో ఎస్ఐ లక్ష్మణబాబు సిబ్బందితో ఆదివారం సాయంత్రం వాహనాలు తనిఖీ చేశారు. ఎన్నికల నియమావళి అమలులో ఉన్న దృష్ట్యా వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. వాహనాలకు సంబంధించిన రికార్డులను, డ్రైవింగ్ లైసెన్సులు, ఇన్సూరెన్సులను తనిఖీలు చేసి సరైన ధృవపత్రాలు లేనివారికి ఈ చలానాలను విధించారు.


ఏలూరులో టీడీపీలోకి చేరుతున్న వైసీపీ కార్యకర్తలు


శంఖుచక్రపురంలో సూపర్ సిక్స్ పథకాలు వివరిస్తున్న నేతలు


భీమడోలులో గన్ని వీరాంజనేయులు, ధర్మరాజు, నేతల సంఘీభావం

గెలుపే లక్ష్యం

భీమడోలులో టీడీపీ, జనసేన నేతల పిలుపు

భీమడోలు, మార్చి 17: ఎన్నికల్లో గెలుపే లక్ష్యమని, అన్నదమ్ముల్లా ముందుకు వెళుతూ ఉంగుటూరు నియోజకవర్గాన్ని గెలిపిస్తామని టీడీపీ జిల్లా అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులు, జనసేన అభ్యర్థి పత్సమట్ల ధర్మరాజు అన్నారు. భీమడోలులోని గన్ని క్యాంపు కార్యాలయంలో ఉంగుటూరు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ విస్తృత సమావేశం ఆదివారం జరిగింది. తొలుత క్లస్టర్, బూత్ ఇన్‌చార్జులు, తెలుగుదేశం పార్టీ నాయకులు మాట్లాడారు. నియోజకవర్గ అభ్యర్థి పత్సమట్ల ధర్మరాజు మాట్లాడుతూ కూటమికి, పొత్తుకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా జాగ్రత్తలు తీసుకుంటానని, కార్యకర్తలకు అండగా ఉంటానన్నారు. సంస్థాగతంగా బలంగా ఉన్న టీడీపీ శ్రేణులు ముందుండి తనను నడిపించాలని, మీ వెనుక జనసేన శ్రేణులు నడుస్తాయన్నారు. గన్ని వీరాంజనేయులకు సోదరుడు లాంటి వాడినని ఆయన అడుగుజాడల్లో నడుస్తానన్నారు. గన్ని వీరాంజనేయులు మాట్లాడుతూ పొత్తులో భాగంగా పార్టీ శ్రేణులంతా ధర్మరాజును గెలిపించాలని పిలుపునిచ్చారు. తాను పోటీలో ఉంటే ఎలా పోరాడతారో టీడీపీ శ్రేణులు అదే విధంగా పోరాడాలన్నారు. సోషల్ మీడియా వేదికగా వైసీపీ నాయకులు కూటమిని ఇబ్బంది పెట్టేవిధంగా విష ప్రచారానికి దిగుతున్నారని తెలుగుదేశం, జనసేన నాయకులు, కార్యకర్తలు జాగ్రత్తగా ఉండాలన్నారు. పొత్తుకు విఘాతం లేకుండా సంయమనం పాటించాలన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గం నుంచి టీడీపీ నేతలు, కార్యకర్తలు, పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

వైసీపీ పాలనలో కార్మిక కుటుంబాలు చిన్నాభిన్నం

ఏలూరు టూటౌన్: వైసీపీ పాలనలో కార్మిక కుటుంబాల జీవితాలు చిన్నాభిన్నం అయ్యాయని టీడీపీ అభ్యర్థి బడేటి చంటి అన్నారు. ఓవర్ బ్రిడ్జ్ వద్ద ఆదివారం భవన నిర్మాణ కార్మికులతో ఆత్మీయ సమావేశం జరిగింది. చంటి మాట్లాడుతూ జగన్‌ను ఓడించాలంటే ప్రతీ ఒక్కరు ఓటు హక్కు సద్వినియోగం చేసుకుని టీడీపీ కూటమికి ఓటు వెయ్యాలన్నారు. అనంతరం కొత్తపేటలో ఆత్మీయ సమావేశం జరిగింది. ఎన్నికల కోడ్ వచ్చినప్పుడే సైకో జగన్ పతనం ప్రారంభమైందన్నారు. 30వ డివిజన్ మంచినీళ్ల తోటలో బాలిన ధనలక్ష్మి ఆధ్వర్యంలో వందలాది మంది టీడీపీలోకి వలసవచ్చారు. వీరందరికి చంటి పార్టీ కండువాకప్పి ఆహ్వానించారు. రోజురోజుకు టీడీపీకి వలసలు పెరుగుతున్నాయన్నారు. కార్పొరేటర్లు, మాజీ కార్పొరేటర్లంతా టీడీపీలోకి క్యూకడుతున్నారన్నారు. రాబోయే రోజుల్లో వైసీపీ ఖాళీ అవుతుందని చంటి జోస్యం చెప్పారు. కార్యక్రమంలో వందనాల శ్రీనివాస్, నాయుడు సోము, భీమవరపు హేమసుందరి, భీమవరపు సురేష్, పూజారి నిరంజన్, చోడే బాలు తదితరులు పాల్గొన్నారు.

సూపర్ సిక్స్ పథకాలపై ప్రచారం

చింతలపూడి: టీడీపీ, జనసేన మేనిఫెస్టోలో సూపర్‌సిక్స్ పథకాలపై ప్రగడవరం పంచాయతీ శంఖుచక్రపురంలో టి.చంద్రశేఖర్‌రెడ్డి వివరించారు. కార్యక్రమంలో గ్రామ టీడీపీ నాయకులు కె.టి.ఆర్, రాజారావు, నాగు, శ్రీనివాసరెడ్డి, మారేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.




ప్రజాగళం సభకు తపనా చౌదరి ఆధ్వర్యంలో తరలివెళుతున్న బీజేపీ నేతలు, చింతలపూడి, లింగపాలెం నుంచి వెళుతున్న టీడీపీ నేతలు

ప్రజాగళం సభకు తరలివెళ్లిన నేతలు

ఏలూరు టూటౌన్, మార్చి 17: చిలకలూరిపేటలో టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడిగా నిర్వహించే ప్రజాగళం సభకు జిల్లా నుంచి ఆదివారం పలువురు నేతలు, కార్యకర్తలు తరలివెళ్లారు. బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గారపాటి సీతారామంజనేయ చౌదరి ఆధ్వర్యంలో వందలాది కార్లలో తరలివెళ్ళారు. గన్నవరంలో విమానశ్రయంలో ప్రధాని మోదీకి గారపాటి చౌదరి ఆధ్వర్యంలో స్వాగతం పలికారు. అనంతరం చిలకలూరిపేట సభలో పాల్గొన్నారు. బీజేపీ నాయకులు కొడూరి లక్ష్మీనారాయణ, గాది రాంబాబు, గుమ్మడి చైతన్య, ఏసుబాబు, నడపన ధాన భాస్కరరావు, సత్యనారాయణ, పాల్గొన్నారు.

- చింతలపూడి: మండలంలోని ప్రగడవరం, చింతలపూడి, తదితర గ్రామాల నుంచి నాయకులు, కార్యకర్తలు చిలకలూరిపేట ప్రజాగళం సభకు తరలివెళ్లారు. స్థానిక పెట్రోల్‌బంకు వద్ద పట్టణ టీడీపీ అధ్యక్షుడు పక్కాల వెంకటేశ్వరరావు జెండాఊపి ప్రారంభించారు. కొత్తపూడి శేషగిరి, కొప్పెర్ల నాగరాజు, టి.రామారావు, యోహాను, టి.అప్పారావు తదితరులు పాల్గొన్నారు.
- లింగపాలెం: మండలం నుంచి ప్రజాగళం బహిరంగ సభకు వేలాది మంది కార్యకర్తలు తరలివెళ్లారు. గరిమెళ్ళ చలపతిరావు ఆధ్వర్యంలో బస్సులు, కార్లు, ఆటోలలో కార్యకర్తలు తరలివెళ్ళారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలుగుదేశంపార్టీ కార్యకర్తలు ప్రతిఒక్కరూ పార్టీ గెలుపునకు కృషిచేయాలని కోరారు. వచ్చే ఎన్నికల్లో ప్రతి కార్యకర్త సైనికుల వలే పని చేయాలని పార్టీని గెలిపించుకునేందుకు సిద్ధంగా ఉండాలని కోరారు. ఈ సందర్భంగా వేలాది మంది కార్యకర్తలు సభకు తరలివెళ్లారు.

పోలవరంలో ఇండియా కూటమి నుంచి సీపీఐ పోటీ


సమావేశంలో మాట్లాడుతున్న వనజ

చింతలపూడి, మార్చి 17: ఇండియా కూటమి తరపున పోలవరంలో సీపీఐ అభ్యర్థి కారం దారయ్య పోటీ చేస్తారని సీపీఐ జిల్లా ఇన్‌చార్జ్ అక్కినేని వనజ తెలిపారు. సీపీఐ కార్యాలయంలో ఏలూరు జిల్లా కార్యవర్గ సమావేశం బండి వెంకటేశ్వరరావు అధ్యక్షతన ఆదివారం జరిగింది. వనజ మాట్లాడుతూ బీజేపీతో జతకట్టిన పార్టీలను, రాష్ట్రాభివృద్ధిని కుంటుపడేసిన వైసీపీని ప్రజలు ఓడించాలని, ఇండియా కూటమిని గెలిపించాలని పిలుపునిచ్చారు. ఏలూరు జిల్లాలో పార్లమెంట్‌తో పాటు ఏడు అసెంబ్లీ సీట్లలో కూడా ఇండియా కూటమి అభ్యర్థులను గెలుపుకోసం సీపీఐ నాయకులు కృషిచేయాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలు, ప్రభుత్వరంగ సంస్థల ప్రైవేటీకరణ ప్రజలకు వివరించి ఇండియా కూటమి విజయానికి కృషిచేయాలన్నారు. పోలవరం ఎస్టీ నియోజకవర్గంలో ఇండియా కూటమి తరపున కారం దారయ్య పేరును ఏకగ్రీవంగా ఆమోదించి రాష్ట్ర పార్టీ పరిశీలనకు పంపినట్లు తెలిపారు. సమావేశంలో డేగా ప్రభాకర్, హేమశంకర్, ఎండీ మున్నీర్, ఎస్.సాయిబాబా, బి.వెంకటేశ్వరరావు, బాడిశ రాము, ఎం.వెంకటాచారి పాల్గొన్నారు.

రాష్ట్రానికి ప్రత్యేక హోదా కాంగ్రెస్‌తోనే సాధ్యం


ముస్లిం నాయకులతో మాట్లాడుతున్న ఆలపాటి

పెదపాడు, మార్చి 17 : రాష్ట్రానికి ప్రత్యేక హోదా కాంగ్రెస్‌తోనే సాధ్యమని దెందులూరు నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు ఆలపాటి నరసింహమూర్తి తెలిపారు. వసంతవాడలో కాంగ్రెస్ విధివిధానాలపై అవగాహన కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. తొలుత స్థానిక మసీదులో మత పెద్దలతో కలసి ప్రార్థనలు నిర్వహించారు. నరసింహమూర్తి మాట్లాడుతూ కాంగ్రెస్ పాలనలోనే దేశంలో, రాష్ట్రంలో అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు జరిగాయని, వాటిని తిరిగి పొందేందుకు కాంగ్రెస్‌ను ప్రతి ఒక్కరూ ఆదరించాలని కోరారు. కార్యక్రమంలో ఏలూరు జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు ఎ.ఆర్.వెంకటచౌదరి, జిల్లా ప్రచార కమిటీ సభ్యులు యోహాన్‌రాజు, కిషోర్, నజీర్ తదితరులు పాల్గొన్నారు.

మద్యం అక్రమంగా తీసుకువెళుతున్న ఒకరి అరెస్టు

ఏలూరు క్రైం, మార్చి 17 : మద్యాన్ని అక్రమంగా తీసుకువెళ్తున్న ఒక వ్యక్తిని ఏలూరు రూరల్ ఎస్ఐ కె రాజారెడ్డి ఆదివారం రాత్రి అరెస్టు చేశారు. ఏలూరు రూరల్ మండలం పాలగూడెం రావిచెట్టు వద్ద ఎస్ఐ కె రాజారెడ్డి తన సిబ్బందితో ఆదివారం రాత్రి తనిఖీలు నిర్వహిస్తుండగా పాలగూడెంనకు చెందిన కడలి మహేశ్వరరావు అక్రమ మద్యంతో పట్టుబడ్డాడు. 4 బీరు బాటిళ్ళు, నాలుగు మద్యం బాటిల్స్ ఉండడాన్ని గుర్తించి అతడిని అరెస్టు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మోదీ సభలో వ్యాఖ్యాతగా నిర్మల కిశోర్



కొయ్యలగూడెం, మార్చి 17: చిలకలూరిపేటలో జరిగిన మోదీ సభలో కొయ్యలగూడెంకు చెందిన బీజేపీ మహిళా మోర్చ రాష్ట్ర అధ్యక్షురాలు నిర్మల కిషోర్ వ్యాఖ్యాతగా వ్యవహరించారు. కొయ్యలగూడెం వాసులు ఆమెను అభినందించారు. ఎంతో ప్రతిష్టాత్మకంగా బీజేపీ, టీడీపీ, జనసేన ఏర్పాటు చేసిన ఈ సభలో ఆమెకు దక్కిన అవకాశాన్ని కొయ్యలగూడెం మండలంలో ప్రతీ ఒక్కరు చర్చించుకున్నారు.

విజ్ఞాన నిలయం గ్రంథాలయం


పుస్తక పఠనంలో విద్యార్థులు

పెదవేగి, మార్చి 17: గ్రంథాలయం విజ్ఞాన నిలయమని లైబ్రేరియన్ తోట అరుణ్‌కుమార్ అన్నారు. శాఖా గ్రంథాలయంలో ఆదివారం చదవడం మాకిష్టం కార్యక్రమం నిర్వహించారు. పలువురు విద్యార్థులు గ్రంథాలయానికి వచ్చి గ్రంథపఠనం చేశారు. అరుణ్‌కుమార్ మాట్లాడుతూ గ్రంథ పఠనం సృజనాత్మకతను పెంచుతుందన్నారు. చదువుతోపాటు గ్రంథ పఠనం చేయడం వ్యక్తి ఉన్నతికి దోహదపడుతుం దన్నారు. ప్రతి విద్యార్థి తప్పనిసరిగా విజ్ఞానదాయక పుస్తకాలు చదవాలని, అదే వారి జీవితాన్ని ఉన్నతమైన దిశగా నడిపిస్తుందని ఆయన తెలిపారు.

పారిజాతగిరి ఆలయానికి 200 కుర్చీలు


ఆలయానికి కుర్చీలను ఇస్తున్న దాతలు

జంగారెడ్డిగూడెం టౌన్, మార్చి 17: గోకుల తిరుమల పారిజాతగిరి వేంకటేశ్వరస్వామి ఆలయానికి దేవస్థానానికి పట్టణానికి చెందిన వ్యాపారి రూ.40 వేలు విలువైన 200 కుర్చీలను ఆదివారం అందజేశారు. దాతలు కర్పూ రం వెంకట సుబ్బారావు, యామినీ ప్రియ, పాలూరి భరత్, ప్రియ మౌనికను ఆలయ కమిటీ ఛైర్మన్ గూడపాటి రాధాకృష్ణ, అర్చకులు నల్లూరి రవికుమారాచార్యులు, ఆలయ ఈవో మానికల రాంబాబు అభినందించారు. వేద పండితులు ఆశీస్సులు అందజేశారు. స్వామి వారి శేష వస్త్రం, ప్రసాదాలను అందజేశారు.

నేటి నుంచి మేరీమాత ఉత్సవాలు

టి.నరసాపురం, మార్చి 17: వెలగపాడులో నిత్య సహాయ మేరీమాత ఉత్సవాలు సోమవారం నుంచి ప్రారంభిస్తున్నట్లు బొర్రంపాలెం ఆర్‌సిఎం విచారణ గురువు బత్తుల సువర్ణరాజు ఆదివారం తెలిపారు. మూడు రోజులు జరిగే ఉత్సవాల్లో విచారణ గురువుల ఆధ్వర్యంలో ప్రతి రోజు జపమాల, దివ్య బలిపూజ నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రభువు దీవెనలు పొందాలన్నారు.


మాట్లాడుతున్న ఢిల్లీ పబ్లిక్ స్కూల్ ఛైర్మన్ మద్దిపాటి చైతన్య

ఘనంగా ఢిల్లీ పబ్లిక్ స్కూల్ వార్షికోత్సవం

జంగారెడ్డిగూడెం టౌన్, మార్చి 17: విద్యార్థులు విద్యలోనే కాకుండా అన్ని రంగాల్లో ముందుండాలని ఢిల్లీ పబ్లిక్ స్కూల్ ఛైర్మన్ మద్దిపాటి చైతన్య అన్నారు. ఢిల్లీ పబ్లిక్ స్కూల్ రెండో వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వచ్చిన సెయింట్ ఆన్స్ స్కూల్ ఛైర్మన్ విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు తిలకించి అభినందించారు. కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి పదో తరగతి పరీక్షలు

చింతలపూడి, మార్చి 17: పదో తరగతి పరీక్షలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. మండలంలో పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎంఈవో జి.రామారావు తెలిపారు. ప్రభుత్వ ప్రైవేట్ విద్యార్థులు 1109మంది పరీక్షలకు హాజరవుతున్నారని, చింతలపూడిలో 5, యర్రగొండపల్లిలో 1, ప్రగడవరంలో 1 పరీక్షాకేంద్రాలు ఏర్పాటు చేశామని తెలిపారు. అన్ని పరీక్షా కేంద్రాల్లో వైద్యం, మంచినీరు, బల్లలు ఏర్పాటు చేశామన్నారు.

పెదవేగిలో..

పెదవేగి, మార్చి 17: పదో తరగతి పరీక్షల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని ఎంఈవో సీహెచ్.బుధవాస్ తెలిపారు. మండలంలో ప్రభుత్వ, ప్రైవేట్ స్కూల్స్ నుంచి 1240 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నారు. పెదవేగి, ముండూరు, కూచింపూడి, విజయరాయి, కొప్పాక జడ్పీ హైస్కూల్స్‌తోపాటు పెదవేగి ఎస్ఎంసీ హైస్కూల్‌లో పరీక్షా కేంద్రం ఏర్పాటు చేసినట్లు ఎంఈవో తెలిపారు. విద్యార్థులు సకాలంలో పరీక్షా కేంద్రానికి చేరుకోవాలని ఆయన సూచించారు. పరీక్షా కేంద్రాల దగ్గర తాగునీరు, ప్రథమ చికిత్సా కేంద్రం ఏర్పాటు చేశామని వివరించారు.

లింగపాలెంలో..

లింగపాలెం, మార్చి 17: మండలంలో పదో తరగతి పరీక్షలకు సర్వం సిద్ధం చేసినట్లు ఎంఈవో కె.రామారావు తెలిపారు. సింగగూడెంలో 1, రంగాపురంలో 1, ధర్మాజీగూడెంలో 2 పరీక్షాకేంద్రాలను ఏర్పాటుచేసినట్లు ఆయన తెలిపారు. విద్యార్థులు పరీక్షలను ప్రశాంతంగా రాయాలని, మాస్ కాపీయింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. విద్యార్థులకు తాగునీరు, వైద్యసిబ్బందిని అందుబాటులో ఉంచినట్లు ఆయన తెలిపారు.

వేంకటేశ్వరాలయంలో విగ్రహాల ప్రతిష్ట

లింగపాలెం, మార్చి 17: లక్ష్మి వేంకటేశ్వరస్వామి ఆలయంలో విగ్రహాల ప్రతిష్ఠ కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు మంగళవాయిద్యాలు, మంత్రోచ్ఛరణల మధ్య స్వామివారి విగ్రహాలను ప్రతిష్ఠించారు. భక్తులకు అన్నదాన సమర్పణ చేశారు. ఆలయ కమిటీసభ్యులు పర్రెడ్డివేమనరెడ్డి, మోరంపూడి మల్లికార్జునరావు, భక్తులకు కావాల్సిన సౌకర్యాలను ఏర్పాటు చేశారు.

రామలింగేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ఠకు ఏర్పాట్లు

పెదపాడు, మార్చి 17: సత్యవోలులో నిర్మించిన గంగాపార్వతీ సమేత రామలింగేశ్వరస్వామి ఆలయంలో ఈనెల 23న విగ్రహ ప్రతిష్ఠ చేయనున్నారు. ఏర్పాట్లు చేస్తున్నట్లుగా జడ్పీ ఛైర్మన్ ఘంటా పద్మశ్రీ తెలిపారు. ఆలయ కమిటీ, దాతలు, భక్తులు, గ్రామస్తుల ఆధ్వర్యంలో ప్రతిష్ఠా మహోత్సవాలు ఘనంగా జరుగుతాయన్నారు. 27న అన్నసమారాధన జరుగుతుందని, పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొవాలని కోరారు.

రామకోటి ప్రాంగణంలో ఉచిత వైద్య శిబిరం

ఏలూరు కల్చరల్, మార్చి 17: రామకోటి ప్రాంగణంలో లయన్స్‌క్లబ్, పరమహంస యోగానంద నేత్రవైద్యశాల ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. 200మంది పరీక్షలు నిర్వహించి, 18మందికి ఆపరేషన్ అవసరమని గుర్తించారు. 34మందికి సబ్సిడీపై కళ్లజోళ్లు పంపిణీ చేశారు.ఎం.జె.ఎఫ్ మానేపల్లి రామారావు, పి.శ్రీనివాస్, బి.సురేష్, పండ్రినాథ్, చెన్నావెంకటరామయ్య, అల్లం సుబ్బారావు పర్యవేక్షించారు.

గెడ్డపల్లిలో ఉమర్ అలీషా ట్రస్ట్ వైద్య సేవలు

పోలవరం, మార్చి 17: గెడ్డపల్లి ఏజన్సీ గ్రామంలో ఆదివారం ఉమర్ అలీషా రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రాజమహేంద్రవరం వైద్యులు గోలి రామారావు కొండరెడ్లకు ఉచిత వైద్య సేవలందించారు. డాక్టర్ గోలి రామారావు మాట్లాడుతూ వెయ్యిమంది రోగులకు ఉచిత వైద్య సేవలందించినట్లు తెలిపారు. ఉచిత రక్త పరీక్షలు, ఈసీజీ నిర్వహించి, మలేరియా, మధుమేహం ఇతర రోగాలకు రూ.లక్ష విలువ చేసే మందులు పంపిణీ చేసినట్లు తెలిపారు. కొండరెడ్లు వారి జీవన ఆహార శైలి వల్లనే ఎదురయ్యే వేరియంట్లను ఎదుర్కొంటున్నారన్నారు. గైనకాలజిస్ట్ పద్మావతి, వైద్యులు పీవీఎస్ఎన్.రాజు, సర్పంచ్ సూండ్రు శారద, పి.రాము, ఏవీ.రాజు, ఎస్‌కె నయీం, ఎస్‌కె ఇస్మాయిల్, తేజ, నవీన్, వీరబాబు, తదితరులు పాల్గొన్నారు.

రేపు కైకరంలో మానవత వైద్య శిబిరం

ఉంగుటూరు, మార్చి 17: రాజమహేంద్రవరంలోని వేద స్పైయిన్ సెంటర్ ఆధ్వర్యంలో ఈ నెల 19న కైకరంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నట్లు మానవత మండల శాఖ తెలిపింది. ఈ అవకాశాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరింది.

వృద్ధురాలికి మానవత ఆర్థిక సహాయం

పోలవరం, మార్చి 17: పేద దళిత వృద్ధురాలికి మానవత స్వచ్ఛంద సేవా సంస్థ రూ.5 వేలు, దుస్తులు అందజేశారు. పూనెం పోశీరావు మాట్లాడుతూ కమ్మరగూడెం గ్రామానికి చెందిన దళిత వృద్ధురాలికి తమ సంస్థ తరఫున సహాయం అందించామని, ఆర్తులను ఆదుకోవడానికి మానవత ముందుంటుందన్నారు. అధ్యక్షుడు గణేష్, సభ్యులు చంద్రయ్య, ఆకుల నరసింహమూర్తి, నారాయణ, కోటంరాజు రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

రాచూరు పల్లాలమ్మ జాతర ప్రారంభం

ఉంగుటూరు, మార్చి 17: రాచూరు గ్రామ దేవత పల్లాలమ్మ జాతర ఆదివారం ప్రారంభమైంది. తొలి రోజున అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ఆర్థిక సహాయం అందించిన సొంగా సందీప్

లింగపాలెం, మార్చి 17: తిమ్మక్కపాలెం గ్రామానికి చెందిన బుల్లా అప్పారావు అనారోగ్యంతో మృతి చెందాడు. అతడి కుటుంబాన్ని లిడ్‌క్యాప్ డైరెక్టర్ సొంగా సందీప్ పరామర్శించి కుటుంబ సభ్యులకు ఆర్థిక సహాయం అందజేశారు. అతని కుటుంబానికి తాను ఎల్లప్పుడూ తోడుగా ఉంటానని అన్నారు. ఆయనతో పాటు ఎమ్మార్పీఎస్ నాయకుడు ముళ్ళపూడి సుమన్, సర్వేశ్వరరావు, మధు, గ్రామస్థులు పాల్గొన్నారు.

రాజకీయ ఫ్లెక్సీలు.. బ్యానర్ల తొలగింపు


బుట్టాయగూడెంలో విగ్రహాలకు ముసుగు

ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో బహిరంగ ప్రదేశాల్లో ఏర్పాటు చేసిన వివిధ రాజకీయ పార్టీల ఫ్లెక్సీలను. జెండాలను, బోర్డులను అధికారులు తొలగిస్తున్నారు. జిల్లాలో ఆదివారం పలుచోట్ల ఫ్లెక్సీలను తొలగించి, నాయకుల విగ్రహాలకు ముసుగు వేయించారు. పోలవరంలో తొలగించిన బోర్డులు, జెండాలు, ఫ్లెక్సీలను పంచాయతీ కార్యాలయానికి తరలించారు. జెండాలు, బోర్డులు, ఫ్లెక్సీలు ఆయా పార్టీల ప్రతినిధులు వాటిని స్వచ్ఛందంగా తొలగించాలని గ్రామ కార్యదర్శి వై.కొండలరావు కోరారు. లింగపాలెం మండలంలో ప్రభుత్వ కార్యాలయాలు, బహిరంగ ప్రదేశాల్లో రాజకీయ నాయకుల ఫొటోలను, ఫ్లెక్సీలను అధికారులు తొలగిస్తున్నారు. విగ్రహాలకు ముసుగులు తొడిగారు. ఎంపీడీవో రాంబాబు, తహసీల్దార్ ప్రసాద్, అధికారులు తొలగింపు చర్యలు పర్యవేక్షిస్తున్నారు. రాజకీయ పార్టీలు ఎన్నికల నియమావళి తప్పక పాటించాలని టి.నరసాపురం ఎంపీడీవో కె.జోగేశ్వరరావు సూచించారు. ఫ్లెక్సీలు తొలగించడంతో పాటు నాయకుల విగ్రహాలకు ముసుగు వేయించారు. ప్రైవేటు స్థలాల్లో ఫ్లెక్సీలపై లిఖితపూర్వకంగా తెలియజేయాలని ఆయన తెలిపారు. ద్వారకాతిరుమల మండలంలో ప్రధాన కూడళ్లలో రాజకీయ నాయకుల ఫ్లెక్సీలను అధికారులు తొలగించారు. రాజకీయ నేతల విగ్రహాలకు ముసుగులు వేశారు. మరికొన్ని ప్రాంతాల్లో ఫ్లెక్సీలను తొలగించాల్సి ఉంది. బుట్టాయగూడెం మండలంలో నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, ఐటీడీఏ పీవో ఎం.సూర్యతేజ పర్యటించి రాజకీయ నాయకుల విగ్రహాలకు ముసుగులు వేయించారు. బ్యానర్లు, ఫ్లెక్సీలను తొలగింపజేశారు. 1654 పోస్టర్లు, 1229 బ్యానర్లు, 522 హోర్డింగులు, 383 గోడ పెయింగ్‌లు తొలగించినట్లు తెలిపారు.

పోలవరం / లింగపాలెం / టి.నరసాపురం / ద్వారకా తిరుమల / బుట్టాయగూడెం


ద్వారకాతిరుమలలో విగ్రహాలకు ముసుగు


పోలవరంలో ఫ్లెక్సీలు తొలగిస్తున్న పంచాయతీ సిబ్బంది


ద్వారకాతిరుమలలో ఫ్లెక్సీలను తొలగిస్తున్న సిబ్బంది


లింగపాలెంలో ఫ్లెక్సీలు తొలగిస్తున్న సిబ్బంది


ప్రజాగళం సభకు తరలివెళుతున్న నూజివీడు టీడీపీ శ్రేణులు


కైకలూరు నుంచి తరలివెళుతున్న టీడీపీ, బీజేపీ నాయకులు


లోపూడి నుంచి వెళుతున్న టీడీపీ శ్రేణులు


చనుబండ నుంచి చిలకలూరిపేట వెళుతున్న టీడీపీ శ్రేణులు

ప్రజాగళమెత్తారు

» చిలకలూరిపేట ప్రజాగళం సభకు తరలిన టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు » కూటమిదే విజయమని ధీమా


ముదినేపల్లి నుంచి వెళుతున్న టీడీపీ నేతలు

నూజివీడు, మార్చి 17: టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ఆధ్వర్యంలో చిలకలూరిపేట ప్రజాగళం సభకు నూజివీడు టీడీపీ శ్రేణులు తరలివెళ్ళాయి. నూజివీడు నియోజకవర్గ టీడీపీ ఉమ్మడి అభ్యర్థి కొలుసు పార్థసారథి నేతృత్వంలో నియోజకవర్గంలోని పలు మండలాల నుంచి బస్సులు, కార్లలో టీడీపీ నాయకులు, అభిమానులు, కార్యకర్తలు భారీగా తరలివెళ్ళారు. నూజివీడు పట్టణం నుంచి మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ చెరుకూరి దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలోనూ పట్టణానికి చెందిన టీడీపీ శ్రేణులు భారీగా తరలివెళ్ళారు.

ముసునూరు: చిలకలూరిపేటలో ఆదివారం జరిగిన ప్రజాగళం బహిరంగ సభకు మండల వ్యాప్తంగా భారీ సంఖ్యలో టీడీపీ శ్రేణులు తరలివెళ్ళాయి. లోపూడి, వేల్పుచర్ల, చెక్కపల్లి, రమణక్కపేట, చింతలవల్లి, సూరేపల్లి, గుడిపాడు తదితర గ్రామాల నుంచి 9 బస్సుల్లో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో ప్రజాగళం సభకు తరలివెళ్ళారు. ఒక్కచాన్స్ అని రాష్ట్రాన్ని అధోగతిపాల్జేసిన జగన్‌రెడ్డి పాలనకు చరమగీతం పాడేందుకు అన్ని వర్గాల ప్రజలు ఎదురుచూస్తున్నారని టీడీపీ నాయకులు పేర్కొన్నారు. ఎన్నికల్లో టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి అధికారంలోకి రావడం తథ్యమన్నారు.

చాట్రాయి: చిలకలూరిపేటలో ఆదివారం జరిగిన ప్రజాగళం బహిరంగ సభకు మండలం నుంచి టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణులు భారీగా తరలివెళ్ళాయి. సభకు ప్రధాని మోదీ, టీడీపీ అధినేత చంద్రబాబు, జనసేనాని పవన్‌కల్యాణ్ హాజరవుతున్నందున మూడు పార్టీల మండల, గ్రామస్థాయి నాయకులు, కార్యకర్తలు బస్సులు, కార్లలో ఉత్సాహంగా తరలివెళ్ళారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఎన్నికల్లో కూటమి అఖండ మెజారిటీతో అధికారం చేపట్టి నవ్యాంధ్ర స్వర్ణాంధ్ర కావటం తథ్యమన్నారు. టీడీపీ మండల అధ్యక్షురాలు బొట్టు వరలక్ష్మి, నాయకులు మందపాటి బసవారెడ్డి, మోరంపూడి శ్రీనివాసరావు, బొట్టు రామచంద్రరావు, మరిడి చిట్టిబాబు, నోబుల్‌రెడ్డి, తల్లాడ శ్రీనివాసరావు, కందుల కృష్ణ, చంద్రకళ, వెల్ది నాగేశ్వరరావు, ఇజ్జిగాని వెంకటేశ్వరరావు, పరసా శ్రీను తదిత రులు సభకు వెళ్ళారు.


ముదినేపల్లి నుంచి చిలకలూరిపేటకు వెళుతున్న బీజేపీ శ్రేణులు

కైకలూరు: ప్రజాగళం బహిరంగ సభకు మాజీ మంత్రి డాక్టర్ కామినేని శ్రీనివాస్ ఆధ్వర్యంలో అభిమానులు పెద్దఎత్తున తరలివెళ్లారు. ఆదివారం కైకలూరు నుంచి 60 కార్లలో టీడీపీ, బీజేపీ, జనసేన కార్యకర్తలు ర్యాలీగా సభ కు వెళ్లారు. ఈ సందర్భంగా ఆయా పార్టీల నేతలు మాట్లాడుతూ రాష్ట్రంలో మూడు పార్టీల పొత్తుతో వైసీపీ పతనం ప్రారంభమైందని రానున్న ఎన్నికల్లో ఆ పార్టీకి భంగపాటు తప్పదన్నారు. రాష్ట్ర వాణిజ్య విభాగం ప్రధాన కార్యదర్శి పీజేఎస్ మాల్యాద్రి, టీడీపీ నాయకులు తలారి రాజే ష్, గంగుల ఏసురాజు, తేరా రమేష్‌బాబు, పళ్లెం తాతారావు, బీజేపీ నాయకులు పేరిచర్ల ప్రసాద రాజు, పైడిపాటి శివశంకర్ తదితరులు తరలివెళ్లారు.

ముదినేపల్లి: తెలుగుదేశం, జనసేన, బీజేపీ కూటమి ఆధ్వర్యంలో ఆదివారం చిలకలూరిపేట సమీపంలోని బొప్పూడి వద్ద జరిగిన ప్రజాగళం సభకు ముదినేపల్లి మండలం నుంచి ఆయా పార్టీల నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు. టీడీపీ నియోజకవర్గ పోల్ మేనేజ్‌మెంట్ ఇన్‌చార్జ్ కొడాలి వినోద్, మాజీ ఎంపీపీ నరసింహారావు, తెలుగు రైతు రాష్ట్ర ఉపాధ్యక్షుడు చలసాని జగన్మోహనరావు, సర్పంచ్ పరసా విశ్వేశ్వరరావు, తెలుగు యువత నియోజకవర్గ అధ్యక్షుడు దావు నాగరాజు, పార్టీ నాయకులు పంతగాని సురేష్, బొంగు రవికుమార్, ఈడే సుధాకర్ ఆధ్వర్యంలో టీడీపీ కార్యకర్తలు తరలి వెళ్లారు. బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోటప్రోలు కృష్ణారా వు, పార్టీ మండల అధ్యక్షురాలు సత్యవోలు నాగలక్ష్మి, బీసీ సెల్ జిల్లా ఉపా ధ్యక్షుడు మొవ్వ ఫణీంద్ర, జనసేన మండల కన్వీనర్ వీరంకి వెంకటేశ్వర రావు, నాయకులు మోటేపల్లి హనుమ, పోకల కృష్ణ, వడ్లాని ఆంజనేయులు తదితరుల ఆధ్వర్యంలో బీజేపీ, జనసేన శ్రేణులు చిలకలూరిపేట సభకు తరలివెళ్లారు.


ముదినేపల్లి రూరల్ మండలం నుంచి వాహనాల్లో..

ముదినేపల్లి రూరల్: పెనుమల్లి, వడాలి, సింగరాయపాలెం, పెదపాలపర్రు, వైవాక, ఊటుకూరు గ్రామాల నుంచి టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు చిలకలూరిపేట సమీపంలో నిర్వహిస్తున్న బహిరంగ సభకు తరలివెళ్ళారు. టీడీపీ మండల అధ్యక్షుడు చల్లగుళ్ళ శోభనాద్రి చౌదరి, జనసేన కన్వీనర్ వేరంకి వెంకయ్య, బీజేపీ మండల కన్వీనర్ పైడిపాటి శివశంకర్, చలసాని జగన్మోహన్‌రావు, అడుసుమిల్లి రామకృష్ణ తదితరులు వాహనాల్లో బొప్పూడి తరలివెళ్ళారు.


ఏలూరులో పరీక్ష కేంద్రాల వద్ద తనిఖీ చేస్తున్న ఎస్పీ మేరీ ప్రశాంతి

గ్రూప్-1 పరీక్షలు ప్రశాంతం

భీమవరం రూరల్ / ఏలూరు కలెక్టరేట్ /ఏలూరు క్రైం/ తాడేపల్లిగూడెం రూరల్ / భీమవరం క్రైం / నరసాపురం టౌన్ మార్చి 17 : ఉమ్మడి జిల్లాలో ఆదివారం జరిగిన ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ గ్రూప్ -1 పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. పశ్చిమ గోదావరి జిల్లాలో ఏడు పరీక్షా కేంద్రాలు, ఏలూరు జిల్లాలో ఐదు కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించగా పశ్చిమలో 62.20 శాతం, ఏలూరులో 62.85 శాతం మంది హాజరైనట్టు అధికారులు తెలిపారు. పశ్చిమ గోదావరి జిల్లాలో నిర్వహించిన ఉదయం పేపరు-1 పరీక్షకు 4,209 మంది దరఖాస్తు చేసుకోగా 2,618 మంది హాజరయ్యారని, 1591 మంది గైర్హాజరయ్యారని 62.20 శాతం నమోదైనట్లు జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ గాంధీ తెలిపారు. మధ్యాహ్నం పేపరు -2 పరీక్షకు 4,209 మందికి 2596 మంది హాజరవగా 1613 మంది గైర్హాజరయ్యారని తెలిపారు. పరీక్షల అనం తరం ప్రశ్నాపత్రాలు, ఓఎంఆర్ షీట్లు, ఇతర పరీక్షా సామాగ్రి పూర్తి బందోబస్తుతో స్ట్రాంగ్ రూమ్‌కి తదుపరి ఏపీపీఎస్సీ అధికారులు ప్రత్యేక భద్రతతో విజయవాడ తరలించనున్నట్టు తెలిపారు. ఏలూరు జిల్లాలో 4,371 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకోగా ఉదయం 2747 మంది మధ్యాహ్నం 2732 మంది హాజరయ్యారు. మొత్తం 15 మంది గైర్హాజరైనట్టు జేసీ లావణ్య వేణి తెలిపారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రశాం తంగా పరీక్షల నిర్వహణ చేపట్టినట్లు తెలిపారు.ఏలూరులో పరీక్షా కేంద్రా లను జిల్లా ఎస్పీ ఆదివారం తనిఖీ చేశారు. అభ్యర్థులను క్షుణ్ణంగా మెటల్ డిటెక్టర్లతో పరిశీలించారు. ఎలాంటి ఎలక్ట్రానిక్ పరికరాలు, వాచీలు, సెల్ ఫోన్లు తీసుకు వెళ్లకుండా చర్యలు తీసుకున్నారు. నగరంలో ట్రాఫిక్‌నకు అంతరాయం లేకుండా అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. భీమవరంలో పరీక్ష కేంద్రాలను జిల్లా అదనపు ఎస్పీ (అడ్మిన్) భీమారావు తనిఖీ చేశారు. ట్రాఫిక్ పోలీస్‌లు అభ్యర్థులకు ఏవిధమైన ట్రాఫిక్ అంతరాయం కలగకుండా తగిన ఏర్పాట్లు చేశారని, తగిన పటిష్టమైన బందోబస్తు ఏర్పాట్లు చేసినటు తెలిపారు. తాడేపల్లిగూడెం మండలం పెదతాడేపల్లి వాసవీ ఇంజనీరింగ్ కళాశాలలో 52.5 శాతం మంది పరీక్షలకు హాజరైనట్టు పరీక్షల కేంద్రం సూపరింటిండెంట్ డాక్టర్ రత్నాకరావు తెలిపారు. ఉదయం 739 మందికి 662 మంది, సాయంత్రం 1401 మందికి 733 మంది హాజరైనట్టు వివరిం చారు. రూరల్ సీఐ రమేష్ బందోబస్తు ఏర్పాటు చేశారు. నరసాపురం వైఎన్ కళాశాలలో ప్రశాంతంగా ముగిశాయి. సెంటర్ వద్ద గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. అరగంట ముందుగానే పరీక్ష కేంద్రం వద్దకు చేరుకున్నారు.


ఏలూరులో రూమ్ నంబర్లు తెలుసుకుంటున్న అభ్యర్థులు


టెన్త్ పరీక్షా కేంద్రమైన ముదినేపల్లి జూనియర్ కళాశాల

జయహో..

» నేటి నుంచి టెన్త్ పరీక్షలు » ఏర్పాట్లు సిద్ధమన్న అధికారులు

ముదినేపల్లి, మార్చి 17: సోమవారం నుంచి ప్రారంభం కానున్న పదవ తరగతి పరీక్షలకు ముదినేపల్లి మండలంలో విద్యాశాఖ అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ముదినేపల్లిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, జిల్లా పరిషత్ హైస్కూలు, సహాయ మాత హైస్కూలు, పెదగొన్నూరులోని జడ్పీ హైస్కూల్‌లో ఏర్పాటైన పరీక్షా కేంద్రాల్లో 629 మంది విద్యార్థులు పరీక్షలు రాసేందుకు ఏర్పాట్లు చేశారు. బొమ్మినంపాడు హైస్కూలుకు చెందిన 57 మంది, విద్యార్థులు, కోరుకొల్లు హైస్కూల్‌లో పరీక్షలకు హాజరవుతారు. పెదపాలపర్రు హైస్కూల్ నుంచి 39 మంది, ముదినేపల్లి హైస్కూలుకు చెందిన 108, గురజ హైస్కూలుకు చెందిన 53, పెదగొన్నూరు హైస్కూలుకు చెందిన 30, అల్లూరు హైస్కూలుకు చెందిన 22, చిగురుకోటకు హైస్కూలుకు చెందిన 27, వడాలి హైస్కూలుకు చెందిన 90 మంది విద్యార్థులు ఈ ఏడాది పదవ తరగతి పరీక్షలు రాయనున్నట్లు ఎంఈవో నరేష్ కుమార్ తెలిపారు. పరీక్షా కేంద్రాలను విద్యాశాఖ అధికారులతోపాటు ఎస్ఐ డి.వెంకట్ కుమార్ పరిశీలించారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్‌ను విధించారు. పరీక్షల నిర్వహణకు నలుగురు చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్‌మెంటల్ అధికారులతోపాటు సుమారు 50 మంది ఇన్విజిలేటర్లు ఇతర సిబ్బందిని నియమించారు. అల్లూరు నుంచి విద్యార్థులు పెదగొన్నూరు పరీక్షా కేంద్రానికి వెళ్లేందుకు ఆర్టీసీ ప్రత్యేక బస్సును ఏర్పాటు చేశారు. నిత్యం ఈ బస్‌ను స్పెషల్‌గా ఏర్పాటు చేసినందుకు విద్యార్థుల నుంచి చార్జీలు వసూలు చేస్తామని గుడివాడ డిపో అధికారి తెలిపారు.

కలిదిండి: మండలంలో పదవ తరగతి పబ్లిక్ పరీక్షలకు సర్వం సిద్ధం చేశామని ఎంఈవో ప్రభాకర్ బాబు తెలిపారు. కలిదిండి, కోరుకొల్లు, భాస్కరరావుపేట, ఆరుతెగలపాడు జడ్పీ హైస్కూళ్లతోపాటు కోరుకొల్లు క్రాంతి హైస్కూల్, కలిదిండి శశి హైస్కూళ్లలో పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. మొత్తం 102 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతున్నార న్నారు. పరీక్షా కేంద్రాలకు ఉదయం 8.30 గంటలకే విద్యార్థులు చేరుకోవాలని, 9.30 గంటలకు ఒక్క నిమిషం ఆలస్యమైనా పరీక్ష రాయటానికి అనుమ తించమన్నారు. పరీక్షా కేంద్రాల్లో విద్యార్థులకు సౌకర్యాలు ఏర్పాటు చేశామన్నారు.

ఆగిరిపల్లి: నేటి నుంచి జరగనున్న 10వ తరగతి పబ్లిక్ పరీక్షలకు అన్ని ఏర్పాట్లు చేశామని ఎంఈవో-1 సర్వేశ్వరరావు తెలిపారు. ఆగిరిపల్లిలో మూడు సెంటర్లలో పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆగిరిపల్లిలోని జడ్పీ హైస్కూల్, ఎస్వీ పబ్లిక్ హైస్కూల్, ఎస్ఎఫ్ఎస్ హైస్కూళ్లలో పరీక్షలు నిర్వహిస్తున్నామన్నారు. హైస్కూల్లో 210మంది రెగ్యులర్, 73మంది ప్రైవేట్ విద్యార్థులు ఎస్వీ పబ్లిక్ స్కూల్లో 210 మంది రెగ్యులర్, 67 మంది ప్రైవేట్ విద్యార్థులు, ఎస్ఎఫ్ఎస్ హైస్కూల్లో 174 మంది రెగ్యులర్, 56 మంది ప్రైవేట్ విద్యార్థులు పరీక్షలకు హాజరవుతారని తెలిపారు.



నూజివీడు పట్టణంలో ఫుట్ పెట్రోలింగ్

నూజివీడు టౌన్, మార్చి 17: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఆదివారం సాయుధ దళాలు నూజివీడు పట్టణ సీఐ ఎంవీవీఎస్ఎన్ మూర్తి ఆధ్వర్యంలో పట్టణంలో ఫుట్ పెట్రోలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ఎన్నికల నేపథ్యంలో ఓటును స్వేచ్ఛగా వినియోగించుకునే విషయంలో ఎవరైనా ఆటంకాలు కలిగించినా, ప్రలోభాలకు గురిచేసినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పెయ్యేరు కాలనీ వాసుల దీక్షల విరమణ

ముదినేపల్లి, మార్చి 17 : తమ కాలనీలో మురుగు నీటి సమస్య పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ పెయ్యేరు పంచాయతీ ఏరియాలోని వైఎస్ఆర్ కాలనీ వాసులు గత ఐదు రోజులుగా చేస్తున్న రిలే దీక్షలను ఆదివారం విరమించారు. కాలనీలో డ్రైనేజీ సౌకర్యం కల్పించేందుకు సామాజిక ఇంకుడు గుంతను ఏర్పాటు చేసేందుకు స్థలాన్ని ఎంపిక చేస్తున్నామని, త్వరలో పనులు పూర్తి చేసి మురుగు నీటి పారుదల సమస్యను పరిష్కరిస్తామని ఈవోపీఆర్డీ డి.లక్ష్మీనారాయణ, పంచాయతీ కార్యదర్శి శ్యామ్ సుందర్ ఇచ్చిన హామీ మేరకు తాము దీక్షలు విరమిస్తున్నట్లు బీజేపీ ఓబీసీ సెల్ జిల్లా ఉపాధ్యక్షులు మొవ్వ ఫణీంద్ర తెలిపారు. ఆదివారం ఈ దీక్షా శిబిరంలో కాలనీ వాసులకు మద్దతు ప్రకటించిన బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోటప్రోలు కృష్ణారావు మాట్లాడుతూ కాలనీలో డ్రైనేజీ సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు.




ముదినేపల్లి, కైకలూరు, వలసపల్లిల్లో విగ్రహాలకు ముసుగులు వేసిన దృశ్యం

ముసుగేశారు..

» కోడ్ అమల్లోకి రావడంతో నాయకుల విగ్రహాలకు ముసుగులు

కైకలూరు, మార్చి 17: సార్వత్రిక ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిందని నిబంధనలు పక్కాగా అమలుచేయాలని కైకలూరు తహసీల్దార్ ఎస్. పోతురాజు తెలిపారు. ఆదివారం కైకలూరు పట్టణంలోని నాయకుల విగ్రహాలకు ముసుగులు వేసి వివిధ పార్టీల ఫ్లెక్సీలు తొలగించారు. కైకలూరు పంచాయతీ అధికారులు గ్రామంలోని ఫ్లెక్సీలను తొలగించి విగ్రహాలకు ముసుగులు వేశారు. టీడీపీ, జనసేన నాయకులు స్వచ్ఛందంగా తమ ఫ్లెక్సీలను తొలగించుకున్నారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ఎన్నికల నియమాలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని సిబ్బందిని హెచ్చరించారు.

ముదినేపల్లి: ఎన్నికల నియమావళి అమలులోకి రావటంతో ముదినేపల్లి మండలంలోని అన్ని గ్రామాల్లో మాజీ ముఖ్యమంత్రులు ఎన్టీఆర్, వైఎస్ఆర్ విగ్రహాలతోపాటు మాజీ ఎమ్మెల్యే వంగవీటి మోహన రంగా విగ్రహాలకు అధికారులు ముసుగులు వేశారు. ముదినేపల్లిలో వైసీపీ, టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీలకు చెందిన సుమారు 100 ఫ్లెక్సీలు, హోర్డింగులను పంచాయతీ అధికారులు తొలగించారు. కొన్ని టీడీపీ ఫ్లెక్సీలను పార్టీ నాయకుడు కొడాలి వినోద్ ఆధ్వర్యంలో కార్యకర్తలు స్వచ్ఛందంగా తొలగించారు. ఫ్లెక్సీల తొలగింపుతో ముదినేపల్లి సెంటర్ బోసిపోయింది. ఎంపీడీవో గంగాధరరావు, ఈవోపీఆర్డీ లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో పంచాయతీల కార్యదర్శులు ఫ్లెక్సీలు తొలగించారు.

చాట్రాయి: కోడ్ అమల్లో భాగంగా మండలంలో అధికారులు వైఎస్, ఎన్టీఆర్ తదితర నాయకుల విగ్రహాలకు ముసుగులు వేయటంతో పాటు ఆయా పార్టీల ఫ్లెక్సీలు, బ్యానర్లు, జెండాలు తొలగించారు. ప్రభుత్వ కార్యాలయాలు, గ్రామ సచివాలయాల్లో నాయకుల స్టిక్కర్లు తొలగించారు. అన్ని రాజకీయ పార్టీలు, ప్రజలు ఎన్నికల కోడ్ అమలుకు సహకరించాలని అధికారులు విజ్ఞప్తి చేశారు. ఎంపీడీవో మంగాకుమారి, ఈవోపీఆర్డీ మురళీకృష్ణ, పంచాయతీ కార్యదర్శి నాగరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

నూజివీడు టౌన్: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో శనివారం నుంచి



నూజివీడు, ముదినేపల్లిలో బ్యానర్లు తొలగిస్తున్న మున్సిపల్ సిబ్బంది

ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో నూజివీడు పట్టణంలోని వివిధ రాజకీయ పార్టీల బ్యానర్లను మున్సిపల్ సిబ్బంది తొలగించారు. ఈ సందర్భంగా నూజివీడు శానిటరీ ఇన్‌స్పెక్టర్ నాగరాజు ఆధ్వర్యంలో మున్సిపల్ సిబ్బంది వివిధ ప్రాంతాల్లో ఏర్పాటుచేసిన ప్రచార బ్యానర్లను తొలగించారు.

కోడ్ ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

ముసునూరు, మార్చి 17: సార్వత్రిక ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎంపీడీవో సీహెచ్ పద్మావతీ దేవి హెచ్చరించారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున ఆదివారం ఎంపీడీవో తహసీల్దార్ జవహర్ బాజి ఆధ్వర్యంలో మండలంలోని ప్రభుత్వ కార్యాలయాల్లో, 16 గ్రామ సచివాలయాల పరిధిలో ఉన్న వివిధ రాజకీయ పార్టీల నాయకుల ఫ్లెక్సీలు, ఫొటోలు తొలగించి, సచివాలయాల్లో వివిధ పథకాల బోర్డులపై ఉన్న సీఎం చిత్రాలు, శిలాఫలకాలపై ఉన్న సీఎం, ఎమ్మెల్యే చిత్రాలు కనిపించకుండా సచివాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు సంయుక్తంగా స్టిక్కర్లు వేశారు. రమణక్కపేట, వలసపల్లి, చింతలవల్లి, కొర్లకుంట, గోపవరం, వేల్పుచర్ల తదితర గ్రామాల ప్రధాన కూడళ్లల్లో ఉన్న రాజకీయ ప్రముఖుల విగ్రహాలకు ముసుగులు వేశారు. ఫ్లయింగ్ స్క్వాడ్ టీవీఎస్ సుబ్బారావు ఈ ప్రక్రియను పర్య వేక్షించారు. ఎన్నికల ప్రక్రియ ముగిసే వరకు మండలంలో ఎన్నికల నియమా వళి ప్రకారం అన్ని రాజకీయ పార్టీ నాయకులు నడుచుకోవాలని సుబ్బారావు తెలిపారు.

నిబంధనలు కచ్చితంగా అమలుచేయాలి

నూజివీడు టౌన్, మార్చి 17: ఎన్నికల ప్రవర్తనా నియమావళి కచ్చితంగా అమలయ్యేలా చూడాలని నూజివీడు రూరల్ సీఐ రామకృష్ణ అన్నారు. కోడ్ అమల్లోకి రావడంతో తీసుకోవాల్సిన చర్యలు, ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకునేలా ప్రజలకు భరోసా కల్పించాలని నూజివీడు సీఐ కార్యాలయంలో జరి గిన సమావేశంలో ఎలక్షన్ టీం అధికారులకు సూచనలిచ్చారు. సమస్యాత్మక ప్రాంతాలలో అలజడులు సృష్టించే వారిపై నిఘా ఉంచాలన్నారు.

ముదినేపల్లి రూరల్: కోడ్ ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని ఎంపీడీవో మురళీ గంగాధర్ హెచ్చరించారు. ఆదివారం వివిధ గ్రామాల్లో పర్యటించి ఎన్నికల నిబంధనలకు పక్కాగా అమలు చేయాలని లేకుంటే సస్పెన్షన్‌కు గురవుతారని పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలను ఆదేశించారు.


నూజివీడులో సూచనలిస్తున్న సీఐ రామకృష్ణ

జిల్లాలో వాహనాల తనిఖీ

ఏలూరు క్రైం, మార్చి 17: ఎన్నికల నియమావళి అమల్లో ఉన్నందున ఎస్పీ ఆదేశాల మేరకు జిల్లాలో పలు చోట్ల వాహనాలు తనిఖీ చేశారు. వన్‌టౌన్ సీఐ ఎస్.రాజశేఖర్ ఆధ్వర్యంలో ఎస్ఐ లక్ష్మణబాబు సిబ్బందితో ఆదివారం సాయంత్రం వాహనాలు తనిఖీ చేశారు.

క్రైం కార్నర్

యువతి అనుమానాస్పద మృతి

నూజివీడు టౌన్, మార్చి 17: నూజివీడు మండలంలోని గొల్లపల్లి గ్రామంలో ఒరిస్సా రాష్ట్రానికి చెందిన యువతి మనీషా నాయక్ (16) అనుమానాస్పద స్థితిలో మృతిచెందింది. ఓ ప్రైవేట్ కంపెనీలో షిఫ్ట్ డ్యూటీకి వెళ్లిన మనీషా తల్లిదండ్రులు ఆదివారం తిరిగి వచ్చి చూసేసరికి తమ కుమార్తె ఫ్యాన్‌కు చీరతో ఉరి వేసుకుని కనిపించడంతో సమాచారాన్ని నూజివీడు రూరల్ పోలీసులకు అందించారు. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నూజివీడు ఏరియా ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

యువకుడి ఆత్మహత్య

నూజివీడు టౌన్,మార్చి 17: నూజివీడు మండలం మర్రిబంధం గ్రామంలో జి.మణికంఠ (18) అనే యువకుడు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఆదివారం ఉదయం గమనించిన కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారమివ్వగా మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నూజివీడు ఏరియా ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా మర్రిబంధం ప్రాంతంలో జోరుగా పేకాటలు సాగుతుండటంతో జూదంలో నష్టపోయిన యువకుడు ఆత్మహత్యకు పాల్పడినట్లు స్థానికులు చెబుతున్నారు.

కుమార్తెపై అత్యాచారయత్నం

ఆగిరిపల్లి, మార్చి 17: ఆగిరిపల్లి మండలానికి చెందిన 14 ఏళ్ల బాలికపై ఆమె తండ్రి ఇంట్లో ఎవరూలేని సమయంలో అత్యాచారానికి యత్నించగా ఆమె భయపడి కేకలు వేసింది. కేకలు విన్న బాలిక పిన్ని రావ డంతో తండ్రి పరారైనట్టు ఎస్ఐ సురేంద్రబాబు తెలిపారు. బాధితురాలి ఫిర్యా దు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.



నిష్కళంకమాత ఉత్సవాల పోస్టర్ ఆవిష్కరణ

ముసునూరు, మార్చి 17: నిష్కళంకమాత ఉత్సవాల పోస్టర్‌ను ఆదివారం ఉత్సవాల నిర్వాహకులు, ముసునూరు ఆర్‌సీఎం విచారణ గురువులు రెవ.ఫా. జోసఫ్ తంబి ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 21 నుంచి 23వ తేదీ వరకు ఉత్సవాలు జరుగుతాయన్నారు. 22న విజయవాడ పీఠాధిపతి తెలగతోటి జోసఫ్ రాజారావు ముఖ్య అతిథిగా హాజరై సమష్టి దివ్యబలిపూజ చేస్తారని తెలిపారు. ఈ ఉత్సవాలకు క్రైస్తవులంతా హాజరై విజయవంతం చేయాలని కోరారు. విచారణ గురువులు రెవ.ఫా. జోయ్‌అమల్, నోవిస్ మాష్టారు, జాన్‌భారతి, రాజశేఖర్, గాంధీరాజా, దేవరపల్లి బెనర్జీ, చీలి స్వామిదాస్, సిస్టర్లు పాల్గొన్నారు.

టెన్త్ విద్యార్థులకు వార్డెన్ వితరణ



ముసునూరు, మార్చి 17: ముసునూరు బాలుర వసతి గృహంలోని 10వ తరగతి విద్యార్థులకు హాస్టల్ వార్డెన్ షేక్ నజీర్ ఆదివారం పరీక్ష సామగ్రి బహూకరించారు. 20 మంది విద్యార్థులకు ప్యాడ్‌లు, పెన్నులు, ఇతర సామగ్రిని ఆయన అందజేసి పరీక్షల్లో అనుసరించాల్సిన మెలకువలు వివరించారు.

ఆహార పొట్లాలు పంచిన జనసైనికులు



చాట్రాయి, మార్చి 17: చాట్రాయి గ్రామానికి చెందిన జన సైనికులు ఆదివారం నూజివీడు పట్టణంలోని బాబా గుడి, ఇతర ప్రాంతాలలో అనాథలు, బిచ్చగాళ్ళకు 50 ఆహార ప్యాకెట్లు పంపిణీ చేశారు. పవన్‌కల్యాణ్‌ను స్ఫూర్తిగా తీసుకొని నిరుపేదల ఆకలి తీర్చటానికి ఈ కార్యక్రమం చేపట్టినట్టు జనసైనికులు సవరం అభిరామ్, సంతోష్, పవన్, సయ్యద్ తెలిపారు.

వైభవంగా మూల్లంక పెద్దింటమ్మ ఉత్సవాలు



కలిదిండి, మార్చి 17 : మూల్లంక పెద్దింటమ్మ ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఆదివారం అమ్మవారికి భక్తులు విశేష పూజలు చేశారు. చుట్టుపక్కల ప్రాంతాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. మహిళలు అమ్మవారికి పసుపు, కుంకుమలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ ఛైర్మన్ తమ్మినీడి నాగేశ్వరరావు, మాజీ ఎంపీపీ బండి లక్ష్మీతులసీరావు, బోళ్ల ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.